


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఉమ్మడి వరంగల్

హన్మకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు

సోమవారం | 10 | నవంబర్ | 2025 | పేజీలు : 17




# గంజాయి మత్తులో యువత గాయి గాయి

బంగారు భవిత చిత్తు

రవాణా, అమ్మకాలపై

కొరవడిన నిఘా

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 9,మేజర్ న్యూస్ (సూర్య): గంజాయి దీని గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఎందుకంటే, ఇదివరకు పట్టణాల్లో అక్రమంగా అక్కడక్కడ మాత్రమే దొరికే ఈ మత్తు పదార్థం. నేడు మారు మూల గ్రామాల్లోనూ విరివిగా లభిస్తోంది. దీంతో ఎంతోమంది యువత ఈ మత్తుకు బానిసై భవిష్యత్తును అంధకారం లోకి నెట్టుకుంటున్నారు. అక్రమార్జనకు అలవాటు పడ్డ కొందరు తినుబండారాల రూపం లో ఎక్కడిక్కడ గంజాయి అమ్మేస్తుంటే మరికొందరు సిగరెట్ల రూపంలో దీన్ని విక్రయిస్తున్నారు. ఇలా వివిధ మిగతా 2లో..

# పాలిటిక్స్ పక్కా చేస్తా



ఆడబిడ్డలు రాజకీయం చేస్తే ఎలా ఉంటుందో చూపిస్తా

20 ఏళ్లు బీఆర్ఎస్ లో పని చేస్తే అవమానకరంగా బయటకు పంపించారు

కనీసం షోకాజ్ నోటీసు కూడా ఇవ్వలేదు

ఆకలినైనా తట్టుకుంటా అవమానాన్ని మాత్రం తట్టుకోను

అధికారం ఎవరికి శాశ్వతం కాదు శాశ్వతం అనుకున్న వాళ్లనే ప్రజలు ఇంట్లో కూర్చోబెట్టారు

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

సూర్య బ్యూరో ఉమ్మడి వరంగల్, నవంబర్ 9, మేజర్ న్యూస్: పాలిటిక్స్ పక్కా చేస్తా ఆడబిడ్డలు రాజకీయం చేస్తే ఎలా ఉంటుందో చూపిస్తానని కానీ దానికి ఇంకా సమయం ఉందని ఇప్పుడు ప్రజల సమస్యల పైనే పోరాటమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు మిగతా 4లో..

## బాలుడి మృతదేహంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముట్టడి

విధుల్లో నిర్లక్ష్యం వహించిన వైద్యుడు, వైద్య సిబ్బందిని సస్పెండ్ చేయాలి

మంత్రి సీతక్క హామీతో ధర్నా విరమణ



2 లో

## కోటగుళ్ళ సందర్శన కొత్త అనుభూతిని మిగిల్చింది

రాతి నిర్మాణాలు ఎంతో అద్భుతం

ఇక్కడి శిల్ప సంపద ఎంతో ఆకట్టుకుంది

ఐఏఎస్ ల శిక్షణ బృందం

కోటగుళ్ల సందర్శన స్వామి వారికి ప్రత్యేక పూజలు



7 లో

## కమీషన్ల కోసమే మేడారం మహా జాతర అభివృద్ధి పనులు

ఆదివాసుల అస్తిత్వాన్ని దెబ్బ తీసే ప్రయత్నాలు చేయడం మానుకోవాలి

బిఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్చార్జి బడే నాగజ్యోతి డిమాండ్



6 లో

## బాబోయ్ ఇవేం వసూళ్లు.?

కీలకశాఖ అధికారి

అడ్డు అదుపులేని అక్రమాలు

అందినకాడికి దండుకుంటున్న వైనం

ఉన్నతాధికారులు దృష్టి సారించాలంటున్న మండల ప్రజలు




2 లో

# గంజాయి మత్తులో యువత గాయి గాయి

మొదటి పేజీ తరువాయి..

రూపాల్లో గంజాయి యువత చెంతకు చేరుతూ వారిని పెడదారి పట్టిస్తోంది. ఉన్నత శిఖరాలను అందుకోవాల్సిన యువత గంజాయి మత్తులో జోగుతూ గాయి గాయి అవుతున్నారు. వ్యసనాలకు బానిసలై జీవితాన్ని గాఢంధకారం లో ముంచేసుకుంటున్నారు. కిక్కు కోసం అడ్డదార్లు తొక్కుతూ మత్తులో బంగారు భవిష్యత్ ను చిత్తు చేసుకుంటున్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడి ఎంతటి నేరానికైనా తెగిస్తు మృగం లా ప్రవర్తిస్తున్నారు. తాజాగా జిల్లా లో జరిగిన సంఘటనలు కోకొల్లలు మత్తులో సృష్టించిన రగడ అంతా ఇంతా కాదు .మాదక ద్రవ్యాలకు బానిసలైన యువకులు అడ్డు అదుపు లేకుండా ఎంతటి దారుణానికైనా ఒడిగడుతున్నారు. మత్తు కోసం ఉన్మాదుల్లా ప్రవర్తించి పలు నేరాలకు పాల్పడుతూ దారుణాలకు ఒడిగట్టిన ఘటన దిగజా రుతున్నారు. చిన్నగా, పొడి పదార్థంగా లభిస్తుండటంతో సులభంగా గంజాయి యువత చేతుల్లోకి చేరుతోంది. వాటిని విచ్చల విడిగా తీసుకుం టున్న యువత తమ ఆరోగ్యానికి చేటు చేసుకుంటున్నారు. కొంతమందైతే ఆ మత్తులో మునిగి తల్లిదండ్రులను చిత్రహింసలు పెడుతున్నారు. అంతేగాక, చాలామంది కొనేందుకు పైసలు లేక దొంగతనాలకు పాల్పడుతున్నారు. గంజాయి సేవించిన తర్వాత విచక్షణ కోల్పోయి ప్రవర్తిస్తున్నారు. వారికి తెలియకుండానే మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడం, ఇతరులను దుర్భాషలాడం వంటివి చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో హత్యలు, అత్యాచారాలు చేయడానికి కూడా వెనకాడటం లేదంటే గంజాయి మత్తు మనుషుల్ని ఎలా మారుస్తుందో అర్థం చేసుకోవచ్చు. చదువుకునే విద్యార్థులే ఉండటం విద్యార్థులే లక్ష్యంగా ఎక్కడపడితే అక్కడ యథేచ్ఛగా డ్రగ్స్ అమ్మేస్తున్నారు. పిల్లల ప్రవర్తనను కన్నవాళ్లు గుర్తించలేకపోవటంతో మరింత పెడదారి పడుతున్నారని నిపుణులు అంటున్నారు.

### యువతపై గంజాయి తీవ్ర ప్రభావం.

### కొరవడిన నిఘా

ఇటీవల జిల్లాలో జరుగుతున్న కొన్ని సంఘటనలు యువతపై గంజాయి చూపుతున్న ప్రభావానికి ఉదాహరణలుగా చెప్పొచ్చు. నిఘా కొరవడవంతో యువత గంజాయి మత్తుతో చిత్తవుతున్నారు. తాజాగా మహబూబాబాద్



జిల్లా కేంద్రంలో గంజాయి మత్తులో ఉన్న యువకులను టౌన్ సిఐ అదుపులోకి తీసుకున్నారు. మరిపెడ మండలం లో గిరిపురం శివారులో ఓ విద్యార్థి గంజాయి మత్తులో వాహనాలకు అడ్డుగా వెళ్లి న సంఘటన లు ఉన్నాయి. మరిపెడ ఎస్సి హాస్టల్ విద్యార్థి గంజాయి తాగిన సంఘటన వెలుగులోకి వచ్చింది.కురవి మండల కేంద్రం లో కొందరు యువత గంజాయి మత్తులో పలువురి పై దాడికి యత్నించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.పలు మండలాల్లో విద్యార్థులు గంజాయి సేవిస్తు పోలీసులకు పట్టుబడిన సంఘటనలు సందర్భాలు ఉన్నాయి. గంజాయి రవాణా చేస్తూ కొందరు పోలీసులకు దొరుకుతూనే ఉన్నారు.

### గంజాయి రవాణాకు పొరుగు రాష్ట్రాలే కీలకం

### తల్లితండ్రులు భాధ్యత వహించాలి

గంజాయి రవాణాకు పొరుగు రాష్ట్రాలే కీలకంగా ఉందని పోలీసులు చెబుతున్నారు. అందువల్ల ఎక్కడికక్కడ నిఘా నేత్రాలు ఏర్పాటు చేస్తున్నారు. యువతను మంచి మార్గంలో పెట్టేందుకు అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నారు. మత్తుకు గురవుతున్న యువతను ప్రారంభ దశలోనే గుర్తించి కట్టడి చేయాల్సి బాధ్యత తల్లిదండ్రులపై ఉందని నిపుణులు సూచిస్తున్నారు.గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎక్సైజ్ అధికారులతో సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉందని పోలీసులు అంటున్నారు. చిన్నతనం నుంచే డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావాలని సూచిస్తున్నారు.

### శతవిధాల ప్రయత్నిస్తోన్న అధికార యంత్రాంగం

### అడ్డుకట్ట వేస్తున్న అడ్డ దారిలో వచ్చేస్తుంది

గంజాయి నిర్మూలనకు ప్రభుత్వాలు, అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా పూర్తి నియంత్రణ సాధ్యం కావడం లేదు. అందులో యువతకు, వారి తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడమే ప్రధాన కారణమని నిపుణులు చెబు తున్నారు. గంజాయిని అరికట్టడానికి అధికార యంత్రాంగం శతవిధాల ప్రయ త్నిస్తోంది. ఇందుకోసం తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ప్రత్యేకంగా పనిచేస్తుంది.పోలీసులు కూడా ప్రత్యేక నిఘాతో గంజాయి పట్టుకుని సీజ్ చేస్తున్నారు. అయినా అడ్డ దారిలో కొందరు అక్రమార్జనకు అలవాటుపడి అడ్డదారిలో తెచ్చేస్తున్నారు.సరఫరా దారులు నిత్యం కొత్తదారులు తొక్కుతుండటంతో గంజాయిని పూర్తి స్థాయిలో నిర్మూలించడం కష్టంగా మారింది. ఇక్కడ ప్రధానంగా గమనించాల్సిన విషయం ఏంటంటే, డిమాండ్ ఉన్న చోటుకే సరఫరా ఉంటుంది. అంటే పరోక్షంగా జిల్లాలో డ్రగ్స్ తీసుకుంటున్నవారి సంఖ్య పెరగడమే. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి గంజాయిని జిల్లాలో పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### పాన్ షాప్,కిరణాషాప్ లు కేంద్రం గా విక్రయం

సాయంత్రం కాగానే యువత పార్కులు, రహస్య ప్రదేశాల్లో కూర్చొని గంజాయి సిగరెట్లను మత్తులో ఊగుతున్నారు.జిల్లా కేంద్రం లోనే కాకుండా పలు మండల కేంద్రాల్లో పాన్ షాప్,కిరాణా షాప్ లలో సిగరెట్ కు 150 నుండి 500 వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. సంబంధిత శాఖ అధికారులు దాడులు నిర్వహించి గంజాయి విక్రయించే వారిని పట్టుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

---

# బాబోయ్ ఇవేం వసూళ్లు.?

**కీలకశాఖ అధికారి అడ్డు అదుపులేని అక్రమాలు**

**అందినకాడికి దండుకుంటున్న వైనం**

**ఉన్నతాధికారులు దృష్టి సారించాలంటున్న మండల ప్రజలు**




కాటారం, నవంబర్ 09, మేజర్ సూర్య న్యూస్: ప్రతి పనిలో కమిషన్..అందిన కాడికి దండుకోవడమే తన అభిమతం అనే రీతిలో సాగుతోంది ఓ అధికారి వ్యవహార శైలి. అన్నింట్లో చేతివాటం ప్రదర్శిస్తున్న తరుణంలో బాబోయ్ ఇవేం వసూళ్ల అనే చర్చ జోరుగా సాగుతోంది. ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందంటూ మండల ప్రజానీకం అభిప్రాయపడుతుంది. ప్రధాన శాఖల్లో రెండో శాఖగా పేరుగాంచిన శాఖలో అన్ని తానే చూసుకోవాల్సిన అధికారి వింత పోకడ పై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉద్యోగి జీతానికే లంచం తీసుకున్న సదరు మండల స్థాయి అధికారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఆ కార్యాలయంలో ప్రతి పనికి పర్సంటేజ్ ఇవ్వనిదే పని కావడం లేదని ఉద్యోగుల ఆరోపిస్తున్నారు. కార్యాలయ నిర్వహణ బిల్లులో, చిరు ఉద్యోగి జీతానికి, లాంగ్ లీవ్ పైన ఆరుగురు ఉద్యోగుల వద్ద లంచం తీసుకున్న అధికారిపై జిల్లా స్థాయి అధికారులు సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఉద్యోగ సంఘాల నాయకులు పేర్కొన్నారు. కార్యాలయ నిర్వహణ 3 లక్షల బిల్లుకు, గ్రామాధికారి 11 లక్షల జీతం బిల్లులో, ఆరుగురు ఉద్యోగుల లాంగ్ లీవ్ పెట్టగా వారి వద్ద నుండి లంచం తీసుకున్న సంఘటన గత రెండు రోజుల నుండి కాటారం సబ్ డివిజన్లో హాట్ టాపిక్ గా మారింది. మండల స్థాయి అధికారిపై సమగ్ర విచారణ చేపడితే ఉపాధి హామీలో జరిగిన అవినీతి బయటపడే అవకాశాలు మెండుగా ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారాలపై జిల్లా పాలనాధికారి దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిమాండ్ సర్వత్రా వ్యక్తం అవుతుంది.

# బాలుడి మృతదేహంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముట్టడి





కన్నాయిగూడెం, నవంబర్ 09(మేజర్ న్యూస్ సూర్య): విధుల్లో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా 7సంవ త్సరాల బాలుడు మృతి చెందిన ఘటన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం గూర్రేవుల గ్రామంలో చోటు చేసుకుంది. గూర్రేవుల గ్రామానికి చెందిన తిరునగిరి రాజు, సంగీత దంప తుల కుమారుడు హరినాథ్ (7) ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా నాగు పాము కాటు వేసింది. గమనిం చిన కుటుంబ సభ్యులు వెంటనే మం డల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొని రావడం జరిగింది. స్థానికంగా విధుల్లో ఉండవలసిన వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో స్టాఫ్ నర్స్ పాము కాటుకి యాంటీడోస్ ఇంజక్షన్ లేదని నిర్లక్ష్యంగా సమా.దానం ఇవ్వడంతో చేసేదేమి లేక పసరు మందు కోసం నాటు వైద్యుడుని సంప్రదించారు. బాలుడి పరిస్థితి విషమించడంతో నాటు వైద్యుడు వైద్యానికి నిరాకరించడంతో చేసేదేమిలేక 108 అంబులెన్సులో ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. ఏటూరునాగారంలో చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. ఆదివారం పలు దినపత్రికల్లో వచ్చిన కథనాలతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు మరియు గ్రామస్తులు మృతదేహంతో కన్నాయిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ముట్టడిం చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండటం



లేదని, ప్రథమ చికిత్సకు ఏజెన్సీ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది సమాచారం మేరకు ఏటూరునాగారం సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ హాస్పిటల్ వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బందితో బందోబస్త్ ఏర్పాటు చేశారు. మృతుని కుటుంబ సభ్యులు మరియు గ్రామస్తులు కలిసి ఏటూరునాగారం, తుపాకులగూడెం ప్రధాన రహదారిపై మృతదేహంతో సుమారుగా 2గంటలకు పైగా ధర్నా నిర్వహించారు.అనంతరం కుటుంబ సభ్యులు మరియు గ్రామస్తులు మాట్లాడుతూ పాము కాటు తో వచ్చిన బాలుడికి వైద్యం చేయక విధుల్లో నిర్లక్ష్యం చేయడం, పలు దినపత్రిల్లో తప్పుడు కథనాలు వచ్చేలా చేసిన వైద్య సిబ్బంది మరియు స్థానిక డ్యూటీ డాక్టర్ అభినవ్ ను విధుల్లో నుంచి సస్పెండ్ చేసి జిల్లా కలెక్టర్ విచారణ చేసి మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: మంత్రి సీతక్క**

బాలుడి మృతి విషయంలో వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయని మంత్రి సీతక్క అన్నారు. మృతుని కుటుంబ సభ్యులు మరియు గ్రామస్తులు తుపాకులగూడెం, ఏటూరునాగారం ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న విషయం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు యం. డి. అఫ్సర్ పాషా ఫోన్ ద్వారా మంత్రి సీతక్కకు తెలపడం జరిగింది. దీంతో స్పందించిన మంత్రి సీతక్క మాట్లాడుతూ బాలుడు మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వైద్య సిబ్బంది మరియు వైద్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య అధికారిని, జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు.వైద్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య అధికారిని ఆదేశించారు.కన్నాయిగూడెం మండలంలో 24గంటల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నాను గ్రామస్తులు విరమించారు.

# అమరవీరుల కుటుంబాలకు రూ.కోటి అందివ్వాలి

**జై తెలంగాణ అనని వ్యక్తి సీఎం అయ్యారు**

**కళాకారులకు పెన్షన్ ఇవ్వాలి**

**కళలకు పుట్టినిల్లు ఓరుగల్లు**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

**తెలంగాణ జానపద కళాకారులతో కల్వకుంట్ల కవిత సమావేశం**



గీసుగొండ నవంబర్ 09 మేజర్ న్యూస్ (సూర్య) తెలంగాణలో ఉన్న ప్రతి కళాకారునికి ప్రభుత్వం పెన్షన్ అందివ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆదివారం కాశీబుగ్గలో కళాకారులతో ఆమె సమావేశం అయ్యారు.అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణలో లక్షా 50 వేల మంది కళాకారులు ఉన్నారు.వారందరికీ ఈ ప్రభుత్వం పెన్షన్ ఇవ్వాల్సిందేనని,ఇక్కడి ప్రభుత్వం 5 వందల మందికి పెన్షన్ ఇస్తే కేంద్రం 5500 మందికి పెన్షన్ ఇస్తుందన్నారు.ఆ అవకాశం ఉంది. కానీ ఆ అవకాశాన్ని ఈ ప్రభుత్వం వినియోగించుకోవటం లేదని,జై తెలంగాణ అనని వ్యక్తి, తెలంగాణ మీద ప్రేమ లేని వ్యక్తి సీఎం అయితే పరిస్థితి ఇలాగే ఉంటుందన్నారు.ఆయనకు ఉద్యమం, కళలు,కళాకారులు ఏమీ తెల్వవు. ఈ ప్రభుత్వంలో మంత్రుల దగ్గరకు వెళ్లి కళాకారుల పెన్షన్ గురించి మాట్లాడితే కళాకారులు అంటే ఎవరనీ అడుగుతున్నారంటా?తెలంగాణలో పుట్టి కళాకారులు ఎవరనీ అడుగుతారా?అని ప్రశ్నించారు.తెలంగాణ జాగృతి తరపున కళాకారుల గుర్తింపు కార్డులు తయారు చేద్దాం అని వాటిని ప్రభుత్వానికి పంపించి పెన్షన్ వచ్చేలా పోరాడుతామన్నారు.ముందుగా ప్రభుత్వం జానపద అకాడమీ ఏర్పాటు చేయాలని,జానపద అకాడమీ ద్వారా కళాకారులను గుర్తించుకుంటే కేంద్రం నుంచి సులువుగా పెన్షన్లు వస్తాయన్నారు.ఇక సాంప్రదాయ కళాకారులను కూడా ప్రభుత్వం గుర్తించాలని,అమరవీరుల ప్రాణత్యాగంతోనే తెలంగాణ సాధ్యమైందని,వారి కుటుంబాలకు దక్కాల్సిన గౌరవం దక్కటం లేదన్నారు.తెలంగాణ వచ్చాక కొన్ని అమరవీరుల కుటుంబాలకే డబ్బులు ఇచ్చారని,ప్రతి అమరవీరుల కుటుంబానికి కోటి రూపాయలు వచ్చే వరకు జాగృతి పోరాటం చేస్తుందన్నారు. ఈ ప్రభుత్వం ఇవ్వకపోతే వారిని మార్చేసి కొత్త ప్రభుత్వం ద్వారా కోటి రూపాయలు వచ్చేలా పోరాడుతామని తెలిపారు.





# దోపిడి దొంగల ముఠా అరెస్టు



**ఐదు మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**3 లక్షల 48 వేల నగదు, 6 సెల్ ఫోన్లు స్వాధీనం**

**వివరాలు వెల్లడించిన కాటారం డిఎస్పి సూర్యనారాయణ**

కాటారం, నవంబర్ 09, మేజర్ సూర్య న్యూస్: జల్సాలకు అలవాటు పడి ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల గల ముఠాను కాటారం పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను కాటారం డిఎస్పి సూర్యనారాయణ విలేకరుల సమావేశంలో వెల్ల డించారు. తక్కువ ధరకు బంగారం ఇస్తానని నమ్మబలుకుతూ కాటారంలో ఓ సూపర్ మార్కెట్ యజమానిని ఆర్థికంగా మోసం చేసి, మండలంలో పరిధిలో నస్తురుపల్లి వద్ద ఓ వ్యక్తిపై భౌతిక దాడి చేసి దారిదోపిడికి పాల్పడ్డ వారిని పట్టుకునేందుకు జిల్లా ఎస్పీ కిరణ్ ఖారే ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలతో గాలిపు చర్యలు చేపడుతుండగా శనివారం రాత్రి మండల పరిధి లోని చింతకాని గ్రామ శివారులో ఐదుగురు వ్యక్తులు (ఇద్దరు మగ, ముగ్గురు ఆడవాళ్లు) అనుమనాస్పదంగా కనిపించడంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా, సూపర్ మార్కెట్ యజమానితోపాటు, ఓ వ్యక్తిపై భౌతిక దాడి చేసి దారిదోపిడి చేసింది మేమే అని నిందితులు ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ నేరాలు చేసిన వారిలో ప్రకాశం జిల్లాకు చెందిన రాజు సోల్లంకి, నాగపూర్ కి చెందిన పుణ్యభాల చందు రాథోడ్, మీనా పుణ్యం రాథోడ్, మహారాష్ట్ర కారేగావ్ శాంతి విజయ సోలాంకి, స్వప్న ఈశ్వర్ సోలంకి ఉన్నట్లు పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు. నిదుతుల నుంచి రూ మూడు లక్షల 48 వేల నగదు, ఆర్ సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును చేదించిన కాటారం సిఐ నాగార్జున రావు, ఎస్సై ఆకుల శ్రీనివాస్, జక్కుల మహేష్, హెడ్ కానిస్టేబుల్ ప్రవీణ్, కానిస్టేబుల్ రాజు, నాగరాజు, రామారావు, జంపన్న, ఐటి కోర్ వేనులను జిల్లా ఎస్పీ అభినం దించినట్లు డి.ఎస్.పి తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ కాటారం సబ్ డివిజన్ లోని ప్రజలు ఎవరు దొంగల, మోసాలకు బారిన పడవద్దని, ప్రజల అప్రమత్తంగా వివరించాలని పేర్కొన్నారు. ఎలాంటి సమ స్యలు ఉన్న పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, కానిస్టేబుల్ హరికుమార్, గణేష్, లక్ష్మి రాజ్, హరీష్, జగన్, శిరీష, జ్యోతి, స్వాతి, హోంగార్డు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



## కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్న తెలుగు సినిమా నటుడు రఘునందన్



కాళేశ్వరం నవంబర్ 9 మేజర్ న్యూస్ సూర్య: జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని పుణ్య క్షేత్రం కాళేశ్వరం దేవస్థావంలో తెలుగు సినిమా నటులు రఘునందన్ స్వామి వారికీ అభిషేకం, శుభానందా దేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాదాపు చాలా సినిమా లో నటించడం జరిగింది, ప్రత్యేకంగా గుండెజారి గల్లంతు అయ్యిందే,టపాస్, మరెన్నో సినిమాలో నటించాడు, ప్రస్తుతం చాలా సినిమాలో నటిస్తున్నాను, మరికొన్ని రోజులో సాయి కుమార్ కుమారుడు ఆది నటించిన సినిమాలో నటిస్తున్నాను అందులో నేను పోలీస్ గా నటిస్తున్నాను అని రఘునందన్ తెలిపారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ మహాదేవపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు (ఎస్సీ సెల్ )లేతకారి రాజబాబు పాల్గొన్నారు.

## ఘనంగా సురేష్ జన్మదిన వేడుకలు



ఎనుమాముల, నవంబర్ 9, మేజర్ న్యూస్ సూర్య: గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఎస్సార్ నగర్ గ్రామానికి చెందిన యూత్ సీనియర్ నాయకుడు కత్తి సురేష్ జన్మదిన వేడుకలు వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీ బహుజన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అడుప మహేష్ విచ్చేసి కేక్ కట్ చేసి అనంతరం మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరడం జరిగింది. కార్యక్రమంలో గణిపాక కిషోర్ ,చెరుకు హరిబాబు, గణిపాక బాబు, ఎన్టీఆర్ నగర్ యూత్ అధ్యక్షుడు కస్తూరి భరత్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ ఏనుమాముల సౌరం అభిలాష్, కోగిల సుధాకర్, సుదనబోయిన కుమార్, గారే భాస్కర్, రాజిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు భారీగా పాల్గొన్నారు.



# పాలిటిక్స్ పక్కా చేస్తా

**వరంగల్ సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ భవన నిర్మాణం హరీష్ రావు బినామీ కంపెనీది**

**కేసీఆర్ తండ్రిగా పిలిస్తే వెళ్తాను**

**రాజకీయంగా వెళ్లే పరిస్థితి ఇక లేదు**

సూర్య బ్యూరో ఉమ్మడి వరంగల్, నవంబర్ 9, మేజర్ న్యూస్: పాలిటిక్స్ పక్కా చేస్తా ఆడబిడ్డలు రాజకీయం చేస్తే ఎలా ఉంటుందో చూపిస్తానని కానీ దానికి ఇంకా సమయం ఉందని ఇప్పుడు ప్రజల సమస్యల పైనే పోరాటమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం వరంగల్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కల్వకుంట్ల కవిత మాట్లాడు తూ లాస్ట్ ఇయర్ మాత్రమే రాజకీయలు చేయాలని మిగి తా నాలుగేళ్లు అభివృద్ధి జరగాల న్నారు. పాలక పక్షం , ప్రతిపక్షం పని చేయటం లేదని ప్రభుత్వాన్ని అడిగే పని జాగృతి చేస్తుంద ని తెలిపారు. నాలో ప్రశ్నించే తత్వం మారలేదన్నారు. నేడు రాష్టంరతలో పాలక పక్షం , ప్రతి పక్షం జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బిజీగా ఉన్నారని ప్రజల తరుపున అడిగేటోళ్లు లేరని అందుకే మేము ఆ పని చేస్తున్నట్లు తెలిపారు. జూబ్లీ హీల్స్ చిన్న ఎన్నిక కాబట్టి ఈ ఎన్నికల్లో మాకు ఏ స్టాండ్ లేదన్నారు. స్టూటెండ్ యూనియన్ ఎన్నికలు మళ్లీ మొదలు పెట్టాలని, అలాంటప్పుడే కొత్త నాయకత్వం వస్తుందన్నారు. లేదంటే పొలిటిషియన్ పిల్లలు, వాళ్ల చుట్టాలే రాజకీయాల్లోకి వస్తున్నారని తెలిపారు. కొత్త నాయకత్వానికి అవకాశం ఇవ్వాలన్నారు.

**బినామి కంపెనీ హరీష్ రావుది ....**

వరంగల్ సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ భవనాన్ని 11వందల కోట్ల నుంచి 17 వందల కోట్లకు పెంచారని కవిత తెలిపారు. ఒక బినామీ కంపెనీకి పనులు ఇచ్చారని అది హరీష్ రావు బినామీ కంపెనీ అని పేర్కొన్నారు. దానిపై విజిలెన్స్ విచారణ వేసిన ప్రభుత్వం ఎందుకు నివేదిక తెప్పించుకొని చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. తెచ్చుకున్న తెలంగాణ కొందరి తెలంగాణ కాకుండా అందరి తెలంగాణ కావాలన్నారు. అసమానతలు లేని తెలంగాణ కావాలన్నదే నా లక్ష్యమన్నారు. విద్య, వైద్యం విషయంలో తెలంగాణ ప్రజలు గుండె మీద చేయి వేసుకొని నిద్ర పోయే పరిస్థితి ఉండాలని తెలిపారు.

**బీఆర్ఎస్ నుండి అవమానకరంగా బయటకు పంపించారు...**

20 ఏళ్లు బీఆర్ ఎస్ లో పని చేస్తే అవమానకరంగా బయటకు పంపించారని కల్వకుంట్ల కవిత తెలిపారు. కనీసం షోకాజ్ నోటీసు కూడా ఇవ్వలేదన్నారు. నేను తెలంగాణ బిడ్డ నే ఆకలినైనా తట్టుకుంటా అవమానాన్ని మాత్రం తట్టుకోను అన్నారు. బీఆర్ఎస్ నుండి సస్పెండ్ చేసిన తరువాత ప్రజల కోసం పని చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. బీఆర్ ఎస్ లో ఉన్నప్పుడు నన్ను నిజామాబాద్ కే పరిమితం చేశారని ప్రోటోకాల్ అనే తాడుతో కట్టడి చేశారని తెలిపారు. ఉద్యమంలో బతుకమ్మ సంబరాల్లో తెలంగాణ లోని ప్రతి పల్లె తిరిగానని కానీ నన్ను బీఆర్ ఎస్ పార్టీ మాత్రం నిజామాబాద్ కే పరిమితం కావాలని చెప్పారని అన్నారు. కేసీఆర్ తండ్రిగా పిలిస్తే వెళ్తా కానీ పొలిటికల్ గా పిలిస్తే వెళ్లే పరిస్థితి దాటి పోయిందన్నారు. పొలిటికల్ గా బీఆర్ఎస్ తో నాకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

**బీఆర్ఎస్‌లో సంతకంతో పనులు అయిపోయే పరిస్థితి లేకుండే...**

బీఆర్ ఎస్ లో నేను మంత్రి ని కాదని కవిత తెలిపారు. బీఆర్ఎస్ లో సంతకంతో పనులు అయిపోయే పరిస్థితి లేకుండే అన్నారు. సీకేఎం కాలేజి ప్రొఫెసర్ గంగాధర్ శర్మ ను అడగండి ఆ కాలేజి ని ప్రభుత్వ కాలేజి చేయాలని ప్రయత్నించిన కాలేదన్నారు. సీఎం కూతురిని అయినప్పటికి నాకే పని కావటానికి ఏడాది పట్టిందని తెలిపారు. బీఆర్ ఎస్ నుంచి నన్ను ఆకారణంగా సస్పెండ్ చేశారని అయినప్పటికి తెలంగాణ మీద ఉన్న ప్రేమ,అవగాహన తో పోరాటం చేసేందుకు సిద్దమైనట్లు తెలిపారు. భూమి , భుక్తి , విముక్తి కోసం చేసిన సాయుధ రైతాంగ పోరాటం విజయవంతమైందని జమీందారీ వ్యవస్థ రద్దు అయిందన్నారు. అలాగే నీళ్లు, నిధులు , నియామకాలు అనే నినాదంతో తెలంగాణ ను కూడా సాధించుకున్నామన్నారు. కానీ తెలంగాణ లో ప్రతి వర్గానికి న్యాయం జరగలేదన్నారు. ప్రతి కుటుంబంతో పాటు అన్ని వర్గాలు బాగుపడాలనే పోరాటం చేసున్నట్లు చెప్పారు. అది సామాజిక తెలంగాణ ద్వారానే సాధ్యమవుతుందన్నారు.



**వరంగల్ అనగానే ప్రొఫెసర్ జయశంకర్ సార్ గుర్తుకు వస్తారు**

తెలంగాణ ఉద్యమంలో వరంగల్ జిల్లా పాత్ర మరవలేనిదని ఉద్యమానికి ఎంతో స్ఫూర్తినిచ్చిన జిల్లా అని కవిత అన్నారు. వరంగల్ అనగానే ప్రొఫెసర్ జయశంకర్ సార్ గుర్తుకు వస్తారని మా జాగృతి సంస్థ కు అయిన స్ఫూర్తి అని మాకు మార్గదర్శనం చేసిన వారని అన్నారు. తెలంగాణ వ్యక్తులు రాజులకు, రాజ్యాలకు భయపడరని పేర్కొన్నారు. మహిళ అంటే అబల కాదు సబల అని నిరూపించిన రాణి రుద్రమ గడ్డ అని అన్నారు.

**కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లేనా ఎక్కడి గొంగళి అక్కడే...**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లేనా ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్లు పరిస్థతి ఉందని తెలిపారు. ఏ సమస్య లపై విమర్శలు చేసి అధికారంలోకి వచ్చారో ఆ సమస్యలన్ని అలాగే పెండింగ్ లో ఉంచారని చెప్పారు. కేంద్రంలో మూడు సార్లు గెలిచిన బిజేపి తో తెలంగాణ కు పైసా పని కాలేదన్నారు. ఒక్క పెద్ద సమస్య ను కూడా వాళ్లు తీర్చలేదని చెప్పారు. వరంగల్ అంటే రైల్వే హబ్ . అలాంటి వరంగల్ లో కూడా పెద్ద సమస్య ను తీర్చలేదన్నారు. అందుకే మనం తెలంగాణ బిడ్డలుగా ఆలోచన చేయాలని నేను ఓట్లు అడగటానికి రాలేదని, ఎన్నికల సంవత్సరం మాత్రమే రాజకీయాలు చేయాలన్నారు. మిగితా నాలుగేళ్లు అభివృద్ధి జరగాలని అది జరగాలంటే అడిగే వాళ్లు ఉండాలని ఆ అడిగే పనినే జాగృతి సంస్థ చేస్తుందని కవిత అన్నారు. సమావేశంలో జాగృతి నేతలు పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా రెడ్డి గుడిలో శివ కళ్యాణ మహోత్సవం

**శాస్త్రోక్తంగా కళ్యాణ క్రతువులు నిర్వహించిన వేద పండితులు**

**మోటపోతుల సరిత, రవీందర్ గౌడ్ దంపతుల చేతుల మీదుగా కళ్యాణోత్సవం**

**కళ్యాణ క్రతువులు తిలకించిన భక్తజనం**

**మహా అన్న ప్రసాద వితరణ**

**ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదన చారి**





గణపురం, నవంబర్ 09 మేజర్ న్యూస్ సూర్య: గణపురం మండల కేంద్రంలోని శ్రీ నాగ లింగేశ్వర స్వామి రెడ్డి గుడిలో కార్తీకమాస ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం శివ కళ్యాణ మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. గణపురం వాస్తవ్యులు హైదరాబాదులో నివాసం ఉంటున్న మోటపోతుల సరిత రవీందర్ గౌడ్ దంపతుల ఆధ్వర్యంలో శివ కళ్యాణ మహోత్సవ వేడుక నిర్వహించారు. కళ్యాణోత్సవ క్రతువులను కొలనుపాక భద్రం , చిత్తారు వినయ్,లు నిర్వహించారు. కళ్యాణ మహోత్సవ



వేడుకను తిలకించి భక్తులు పులకించిపోయారు. కళ్యాణం అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. కళ్యాణ మహోత్సవం సందర్భంగా శాసనమండలి విపక్ష నేత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదన చారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ పక్షాన శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు.







# సంబురంగా కార్తీక మాస వనభోజన మహోత్సవం

**మార్కండేయునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు**

**పద్మశాలి నినాదాలతో మారుమోగిన ఎర్రగట్టు ఆలయప్రాంగణం**

**ఐక్యతకు చిహ్నం మన పద్మశాలీలు**

**జాతీయ అధ్యక్షులు కందకట్ల స్వామి**

**వనభోజనాలతో పండుగ వాతావరణం - మేయర్ గుండు సుధారాణి**

**దాండియా ఆటలతో ఆడి పాడిన మహిళా మణులు**



హనుమకొండ టౌన్, నవంబర్ 9 మేజర్ న్యూస్ సూర్య: పద్మశాలి కుల బంధువుల కార్తీక మాస సామూహిక వనభోజనాలతో పండుగ వాతావరణం నెలకొందని ప్రతి ఏటా పద్మశాలీలు క్రమం తప్పకుండా ఈ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం హనుమకొండ జిల్లా, పద్మశాలి పరపతి సంఘాల ఆధ్వర్యంలో హసన్పర్తి ఎర్రగట్టుగుట్ట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పద్మశాలి కుల బంధువుల కార్తీకమాస సామూహిక వనభోజనం మహోత్సవం కన్నుల పండుగ కొనసాగింది. వేలాదిగా తరలివచ్చిన పద్మశాలీలతో ఎర్రగట్టు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయి పద్మశాలి మార్కండేయ నినాదాలతో మారుమోగినది. భక్త మార్కండేయ విగ్రహానికి పద్మశాలీలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు. మార్కండేయ దేవుని భక్తిశ్రద్ధలతో వేడుకున్నారు.. అభిషేక వేడుకల్లో పాల్గొన్న అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షులు, మేయర్ గుండు సుధారాణి ప్రభాకర్ దంపతులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం పద్మశాలి జెండాను ఎగరవేసి భారీ బైకు ర్యాలీగా ఎర్రగట్టు గుట్ట నుండి ఎర్రగట్టు సర్కిల్ వరకు బయలుదేరి మార్కండేయ నినాదాలతో హోరెత్తించారు. ర్యాలీలో చేనేత కార్మికుల మర మగ్గం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.. ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు మేయర్ గుండు సుధారాణి ప్రభాకర్ దంపతులు. బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్న పద్మశాలీలు సామూహిక వనభోజనాలు ఆరగించారు. అనంతరం సమావేశంలో ముఖ్య అతిథులకు శాలువాతో సన్మానించి మెమొంటోళ్లు ప్రధానం చేశారు.. చిన్నారుల ఆటపాట





ఎంతగానో అలరించగా, సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. మహిళల దాండియా ఆటలు ఆకట్టుకోగా, మెహందీ పోటీలు సంస్కృతి సంప్రదాయాన్ని గుర్తు చేశాయాయి. పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటిన వారికి ప్రత్యేకంగా సన్మానించి మేమంటో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు సాంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తాయని, మన సంస్కృతి సాంప్రదాయాన్ని మరువద్దని గుర్తు చేశారు. సామూహిక వనభోజన కార్యక్రమంతో పద్మశాలిల బలగం ఏందో సమాజానికి తెలిసిపోతుందని, ఐక్యతతోనే అన్ని సాధించవచ్చు అని, తొలిసారి హనుమకొండ జిల్లాలో వనభోజన కార్యక్రమం విజయవంతం చేయడం గొప్ప విషయం అన్నారు. జాతీయ అధ్యక్షులు కందకట్ల స్వామి ఐక్యతకు మన పద్మశాలీలు అని, రానున్న రోజుల్లో పద్మశాలిలు రాజకీయ రంగంలో రాణిస్తూ అభివృద్ధి పథంలో దూసుకుపోవాలన్నారు.. వేలాదిగా తరలివచ్చిన పద్మశాలీలతో ఆలయ ప్రాంగణం జాతరను తలపిస్తోందని, సామూహిక వనభోజన కార్యక్రమం ఇతర కుడాలకు ఆదర్శంగా నిలుస్తుంది అని ఆశాభావం వ్యక్తం చేశారు. సాయంత్రం కార్తీక మాస దీపారాధన తో కార్తీకమాస వనభోజన కార్యక్రమం ముగియగా, రోజంతా ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు పద్మశాలీలు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తవుటం ఝాన్సీ రాణి రవీందర్, రేషన్ డీలర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బత్తుల రమేష్, అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుండు ప్రభాకర్, ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ వడ్నాల నరేందర్,తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు బచ్చు ఆనందం, ఆడెపు రవీందర్, వనభోజన నిర్వహణ కమిటీ కన్వీనర్ గడ్డం భాస్కర్, కో కన్వీనర్ వైద్యం రాజగోపాల్, ప్రధాన కార్యదర్శులు కేదాశి వెంకటేశ్వర్లు, దిడ్డి రమేష్, గోరంటాల రాజు, అఖిల భారత పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు ఈగ మల్లేశం, కుసుమ సతీష్, సాంబారి సమ్మరావు, యువజన విభాగం



అధ్యక్షులు పోరాండ్ల కృష్ణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కందికట్ల ప్రశాంత్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ పులికంటి రాజేందర్, ఉపాధ్యక్షులు నల్ల సత్యనారాయణ,వెంగళ వేణుగోపాల్, పోరండ్ల రమేష్, కోశాధికారి సత్తూరి సంతోష్ రాజ్, కేదాశి రాకేష్, బేతి అశోక్, సూర్యనారాయణ, పద్మశాలి కుల బంధువులు పాల్గొన్నారు.












## 15న ప్రత్యేక లోక్ అదాలత్

**రాజీ పడడమే - రాజమార్గం**

**కాళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధి గ్రామాలలో అవగాహన సదస్సు**



కాళేశ్వరం నవంబర్ 9 మేజర్ న్యూస్ సూర్య: తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు 15-11-2025న ప్రత్యేక లోక్ అదాలత్ భూపాలపల్లి కోర్టులో నిర్వహిం చబడుతుంది. కావున జిల్లాలో ని అన్ని కోర్టులలో పెండింగ్ లో ఉన్న సివిల్ కేసులు, వివాహ సంబంధిత కేసులు, మోటర్ ప్రమాద క్లైయిమ్లు, చెక్ బౌన్స్ కేసులు, కొట్టు కున్న, తిట్టుకున్న ఇతర రాజీ పడదగిన క్రిమినల్ కేసులలో రాజీ చేసుకోవచ్చును. కావున కక్షిదారులు 15 వ తేదిలోపు మీమీ కేసులను రాజీ చేసుకొనుటకు గాను సంబంధిత కోర్టును గాని, జిల్లాన్యాయ సేవాధికార సంస్థను గాని సంప్రదించగలరు. కక్షిదారులు నవంబర్ 15వ తేదిన జరిగే ప్రత్యేక లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోగలరు అని ఈ సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాళేశ్వరం ఎస్సై జి.తమాషా రెడ్డి ఆధ్వర్యంలో కాళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో ఇంటింట అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

## ఘనంగా ఎమ్మెల్యే గండ్ర జన్మదిన వేడుకలు



చిట్యాల, నవంబర్ 9 మేజర్ న్యూస్: భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు జన్మదిన వేడుకలను ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూట్ల తిరుపతి కేకు కోసి బాణాసంచ పేల్చి సంబరాలను చేసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని సివిల్ ఆసుపత్రిలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గూట్ల తిరుపతి మాట్లాడుతూ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచి నిత్యం ప్రజల కోసం వారి కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటూ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్న తపనతో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి సహకారంతో ప్రజల కోసం అహర్నిశలు పాటు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ, జిల్లా మండల నాయకులు మొకిరాల మధు వంశీ కృష్ణ, దొడ్డి కిష్టయ్య, చిలకల రాయకోమురు, బుర్ర లక్ష్మణ్ గౌడ్, అల్లం రాజు, బుర్ర శ్రీనివాస్ గౌడ్, గడ్డం కొమురయ్య, కిషన్ చిలుముల రాజమౌళి, బుర్ర మల్లేష్ గౌడ్, గంగాధరి రవీందర్, గుర్రపు నర్సయ్య, శనిగరం మొగిలి, గుర్రపు అశోక్, పుల్ల సమ్మయ్య, నరేష్, అందుగుల రాజు, కొర్రి సాంబశివుడు, కొర్రి మైసయ్య, శంకర్ గుర్రపు తిరుపతి గౌడ్, ఆకుల ఆదిరెడ్డి, ఆరేపెల్లి నరసింహారాములు తదితరులు పాల్గొన్నారు.

# కమీషన్ల కోసమే మేడారం మహా జాతర అభివృద్ధి పనులు

**ఆదివాసుల అస్తిత్వాన్ని దెబ్బ తీసే ప్రయత్నాలు చేయడం మానుకోవాలి**

**బిఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్చార్జి బడే నాగజ్యోతి డిమాండ్**



తాడ్వాయి నవంబర్ 09మేజర్ న్యూస్ సూర్య : కమిషన్ల కోసమే మేడారం మహా జాతర అభివృద్ధి పనులు కాలయాపన చేస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ ము లుగు నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి ఆరోపించారు. ఆదివారం తాడ్వా యి మండలంలోని మేడారం సమ్మక్క సారలమ్మ లను బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల తో కలిసి దర్శించుకున్నారు.ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్లు ఇస్తామని చెప్పి ఇప్పుడు 117 కోట్లు కేటాయించడం, ఆ పనులు ఇప్పటివరకు ప్రారంభించకపోవడం, ప్రారంభించిన పనులు నత్త నడకన సాగడం జాతర



సమయానికి పనులు పూర్తి అవుతాయా లేవో అనే సందేహం ఏర్పడిందని జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలవకుండా సౌకర్యాలు కల్పించాలని ఆమె అన్నారు. జాతర పనులు నత్తనడక నడుస్తున్నా కూడా ఈ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తిలాగా వ్యవహరించడం సిగ్గుచేటని ఆమె అన్నారు.మేడారం జాతర 70 రోజుల గడువు మాత్రం ఉందని ఇంకా పనులు ప్రారంభం కాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆమె అన్నారు.జాతర అభివృధిలో భాగంగా మేడారం గ్రామంలోని రోడ్డు విస్తరణ, సైడ్ డ్రైనేజీ గ్రామస్థుల తమ ఇంటి ముందు ఉన్నటువంటి సేద తీర్చే నీడ పందిర్లి,చిరు వ్యపరాలకై నిర్మించుకున్న షేడ్లు తొలగించి పది రోజులు దాటినప్పడికి ఇంకా రోడ్డు,కలువ పనులు యే మాత్రం మొదలు పెట్టకుండా ఆలస్యం చేస్తూ తమ జీవనోపాధి పై దెబ్బ తీస్తున్నారు.ప్రతి ఇల్లు రోడ్డున పడ్డట్లుగా తలపిస్తుంది.పది రోజులుగా రోడ్డు పై వచ్చి పోయే వాహనాల దుమ్ము, ధూళి సరాసరి ఇంట్లోకే వచ్చి పడ్తుండడం వల్ల దారిన పోయే ప్రతివారు తమ ఇంట్లోకే తొంగి చూసే విధంగా ఉండడం వలన తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారు.ఇక్కడి అధివాసు లు పట్ల వారి జీవన మనుగడ పట్ల అధికారులు చాలా చిన్న చూపుతో ఉన్నారని వారి పట్ల చూపుతున్న నిర్లక్ష్యానికి గ్రామ ప్రజల్లో ఆగ్రహాన్ని కలిగిస్తుంది. వనదేవతల దర్శనానికి వచ్చే భక్తులకు నిలువ నీడ లేకుండా జంపన్న వాగు నుంచి గ్రామ చివరన ఉండే బస్ స్టాండ్ వరకు సుమారు 3 వందల పైగా చెట్లను తుడ్చిపెట్టేసారు. తమతో ఎలాంటి గ్రామ సభ ఏర్పాటు చేయకుండా చెట్టు పుట్ట కొట్టే అధికారం ఎవరు ఇచ్చారు. తమ ఆరాధ్య దైవం ఒక కాంట కనిపెడుతూనే ఉంటుందని , ఇలాంటి అధికారుల నిర్లక్ష్యపు తోరణీ కి మూల్యం భారీగా చెల్లించుకోవాల్సి వస్తుంది అని వాపోయారు. ప్రస్తుతం ఉన్నటువంటి పబ్లిక్ టాయ్లెట్స్ ను ఐటీడీఏ షాపింగ్ కాంప్లెక్స్ లను వాడకం లోకి తీసుకుని రాకపోగ మరల మాస్టర్ ప్లాన్ లో భాగంగా గుడి వెనకాల గల ఇరువై ఒక్క ఏకరల పంట పొలాల పై ప్రభుత్వ కన్ను పడటం పై ఆదివాసీ రైతులు ఆందోళన పరుస్తోంది.మేడారం గ్రామ పరిసర ప్రాంతాల్లో జాతర ద్వారా జరిగే రైతుల రెండవ పంట నష్ట పరిహార సంగతి దేవుడెరుగు. జాతర సమయాల్లో వీఐపీ ల పార్కింగ్ కై టెంపరరీ పబ్లిక్ టాయ్లెట్స్ కై భూమి గల వారితో ఎలాంటి సంప్రదింపులు లేకుండా ఇష్టానుసారంగా నిర్మించి జాతర అనంతర వాటిని పుడ్చుకోడానికి అవస్తులు పడ్తున్న రైతులకు నష్టపరిహారం కూడా కలిపించే దాకలు లేవు అంటూ అధికారుల తీరు పై రుసరుసలు ఆడారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, రామ సహాయం శ్రీనివాసరెడ్డి, పోగు నాగేష్,చిడం బాబురావు, శ్రీధర్ గొంది,శివరాజ్,సమ్మిరెడ్డి, కొర్నిబెల్లి శేషగిరి,సురేష్ , ఇంద్రారెడ్డి,జీడిబాబు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జన్మదిన వేడుకలు



భూపాలపల్లి సూర్య, ప్రతినిధి నవంబర్ 09 మేజర్ న్యూస్: ఎన్ ఎస్ యు ఐ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. జిల్లా కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ సెంటర్ లో గండ్ర సత్యనారాయణ రావు జన్మదిన పురస్కరించుకొని ఎన్ ఎస్ యు ఐ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్టేవాడ సురేష్,యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా డిస్టిక్ కన్వీనర్ చిట్యాల అఖిల్ జిల్లా ఉపాధ్యక్షులు పోతర్ల ప్రేమ్ కుమార్, యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా అసెంబ్లీ కోఆర్డినేటర్ తిలక్ చారి, రాజు,అనూప్, ప్రవీణ్, భాస్కర్, స్వాతి కిరణ్, రాజబాబు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# కోటగుళ్ళ సందర్శన కొత్త అనుభూతిని మిగిల్చింది



**రాతి నిర్మాణాలు ఎంతో అద్భుతం**

**ఇక్కడి శిల్ప సంపద ఎంతో ఆకట్టుకుంది**

**ఐఏఎస్ ల శిక్షణ బృందం**

**కోటగుళ్ల సందర్శన స్వామి వారికి ప్రత్యేక పూజలు**





గణపురం రూరల్ నవంబరు 0 9 మేజర్ న్యూస్ సూర్య : కాకతీయులు నిర్మించిన కోటగుళ్ళ సందర్శన కొత్త అనుభూతిని మిగిల్చిందని శిక్షణ ఐఏఎస్ బృందం తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. భూపాలపల్లి జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం ఐఏఎస్ శిక్షణ బృందం 12 మంది అనురాగ్ రంజన్, వటాస్ రాజ్, కృష్ణ ఝా విపశయన తన్వర్ కృష్ణ సి విశేష్ సింగ్ తుషార్ సింగ్ ఆదిత్య సింగ్ మయాంక్ ఖండేల్వాల్ మణిమాల ఎన్ విశాల్ సింగ్ పవార్ అక్షయ్ విలాస్ రితికా రాత్ కోటగుళ్లను సందర్శించారు.ఈ సందర్భంగా కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో సాంప్రదాయబద్ధంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు నాగరాజు వారిని శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలు అందజేశారు. పూజా కార్యక్రమాల అనంతరం వారు ఆలయ విశిష్టతను సీనియర్ జర్నలిస్ట్ రచయిత తాళ్లపల్లి యాదగిరి గౌడ్ ను అడిగి తెలుసుకున్నారు. ఆలయ చరిత్రను తెలుసుకొని వారు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కోటగుళ్లను సందర్శించడం ఇక్కడి ఆలయాల నమూనా తమను ఎంతో ఆకట్టుకుందని రాతి కట్టడాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయన్నారు. సుమారు గంటపాటు ఆలయ ప్రాంగణంలోనే గడిపి ఫోటోలు వీడియోలు చిత్రీకరించుకున్నారు. వారి వెంట గణపురం ఎస్ఐ రేఖ అశోక్ మహా ముత్తారం డీటీ , సందీప్, గణపురం ఆర్ఐ చెక్క దేవేందర్, గుడాల తిరుపతి రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.









# స్థానిక ఎన్నికల్లో యాదవుల సత్తా చూపిస్తాం




**జీఎంపీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు- నాగారబోయిన సారంగం**

**మహాసభకు పెద్ద ఎత్తున తరలివచ్చిన యాదవులు**

గీసుగొండ నవంబర్ 09 మేజర్ న్యూస్ (సూర్య): రాబోయే స్థానిక ఎన్నికల్లో యాదవులు సత్తా చాటాలని జీఎంపీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు నాగారబోయిన సారంగం పిలుపునిచ్చారు.గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం మూడవ మహాసభ జిల్లా అధ్యక్షులు సారంగం ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా మండలంలోని గంగదేవి పల్లి నుండి యాదవులు పెద్ద ఎత్తున మహా సభకు తరలి వెళ్లారు.అనంతరం నర్సంపేట సర్క్యూట్ గెస్ట్ హౌస్ నుండి గొల్ల కురుమల పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరి డప్పు చప్పులతో పద్మశాలి ఫంక్షన్ హాల్ లో సభను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నగరబోయిన సారంగం మాట్లాడుతూ గత ప్రభుత్వం గొర్రెలు ఇస్తామని ప్రకటించి అప్పులు చేసి డీడీలు కట్టిచ్చి మోసం చేసిందని,ఇప్పుడున్న ప్రభుత్వం గొల్ల కురుమలకు రూ.2లక్షలు ఇస్తామన్న మాట నిలబెట్టుకోవలని డిమాండ్ చేశారు.యాదవులు సత్తా చాటాలంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి రాజకీయంగా ఎదగాలని సూచించారు.తెలంగాణలో యాదవుల సంఖ్య 30 లక్షల పైచిలుకు జనాభా కలిగి ఉన్నామని గుర్తు చేశారు చట్టసభల్లో యాదవుకు న్యాయం జరిగే విధంగా పోరాడాలని,యాదవులంటే శ్రీకృష్ణుని వారసులని,నీతికి నిజాయితీకి మారుపేరే యాదవులు అన్నారు.మాట తప్పరు మడమతిప్పరు నమ్మితే ప్రాణాలు ఇచ్చే వ్యక్తులు యాదవులు అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్,గౌరవ అధ్యక్షులు చల్ల మల్లయ్య, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పరికి మధుకర్, జిల్లా కమిటీ సభ్యులు గడ్డి రవి,కాంటెస్ట్ కార్పోరేటర్ కడిదల రామారావు, రాజులపాటి సూరయ్య, గాదం స్వామి,రాజశేఖర్, అశోక్, నానబోయిన రాజు, గాదం రాజ్ కుమార్, గజ్జ కుమార్,కుమారస్వామి, ఐలయ్య, జక్క రవి, రాజకుమార్, శీను, మల్లేష్, సూరయ్య, లింగన్న, శ్రీనివాస్, మైల రాజు, సారయ్య, బొడ్డు రవి, తదితర ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



## వివిధ దశల్లో వినియోగదారుల చైతన్యం



నెక్కొండ,నవంబర్ 9 మేజర్ న్యూస్(సూర్య): వివిధ దశలలో వినియోగదారులలో చైతన్యం పెంచేందుకు భారత వినియోగదారుల సమాఖ్య (సిసిఐ) నిర్మాణాత్మక కార్యక్రమాలతో ముందుకు సాగుతు న్నదని, దీనిలో భాగంగా సిసిఐ జోనల్, జిల్లా స్థాయిల్లో విస్తరణ చేస్తున్నదని సీసీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. సీసీఐ రాష్ట్ర అధ్యక్షులు మామిడి భీమ్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి చక్రపాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వినియోగదారుల పక్షాన నిలబడి వారికి అండగా రూపొందించబడిన చట్టాలు బ్యూరోక్రాట్లు, వ్యాపార ఉత్పత్తిదారుల అజమాయిషితో నీరుగారిపోతున్నాయన్నారు. జాతీయ




స్థాయిలో వినియోగదారుల ఉద్యమ ప్రతినిధులకు నాయకత్వం వహిస్తున్న సిసిఐ చట్టాల రూపకల్పనలో కీలక భూమిక నిర్వహించాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. గ్రామీణ స్థాయి నుంచి రాజధాని వరకు వివిధ స్థాయిలో ఉన్న వినియోగదారుల సమస్యలను గుర్తించి వారి పక్షాన పోరాడుతున్న క్రమంలో వినియోగదారుల సమస్యల పరిష్కారానికి మరింత చేయూతనిచ్చేందుకు సీసీఐ జోనల్ ఇన్చార్జిల నియామకం చేపట్టిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఐదు జోన్లను ఏర్పాటు చేసి సీనియర్ వినియోగదారుల ఉద్యమ ప్రతినిధులను, సీసీఐకి రాష్ట్రస్థాయిలో ప్రాతినిధ్యం వహిస్తున్న వారితో ఏర్పాటుచేసిన కమిటీలను సిసిఐ రాష్ట్ర అధ్యక్షులు మామిడి భీమిరెడ్డి ప్రకటించారు. నెలాఖరుకల్లా జిల్లా స్థాయిలో సిసిఐ ప్రతినిధుల ఎంపిక పూర్తి చేయాలని నిర్దేశించారు. ఈ సమావేశంలో సిసిసి సెక్రటరీ జనరల్ మొగిలిచర్ల సుదర్శన్, సీసీఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ హరిప్రియ రెడ్డి, సీసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుప్రభ హత్వర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బూరుగుపల్లి శ్రవణ్ కుమార్, రావుల రంజిత్ కుమార్, సందు ప్రవీణ్, కార్యదర్శులు శ్రీధర్ రెడ్డి , ప్రవీణ, రంగన్న, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సీసీఐ జోనల్ ఇన్చార్జులు వీరే...**

ఆదిలాబాద్ జోనల్ ఇన్చార్జిగా మాజీద్, వరంగల్ జోనల్ ఇన్చార్జిగా బూరుగుపల్లి శ్రవణ్ కుమార్, నల్గొండ జోనల్ ఇన్చార్జిగా ఎం .యశ్వంత్ కుమార్, హైదరాబాద్ జోనల్ ఇంచార్జ్ గా ఏవి రావు, మహబూబ్ నగర్ జోనల్ ఇన్చార్జిగా అనుదివ్య లను నియమించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ వస్తు నాణ్యతకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు.





# అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన దరఖాస్తుల ఆహ్వానం

### కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్, నవంబర్ 10, మేజర్ న్యూస్ సూర్య: వరంగల్ జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో ఒక పబ్లిసిటీ అసిస్టెంట్ (వీడియో కెమెరామెన్), ఒక పబ్లిసిటీ అసిస్టెంట్ ( ఫోటోగ్రఫర్), ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన 31 మార్చి 2026 వరకు పనిచేయుటకు గాను ఆసక్తి, అర్హత గల అభ్యర్థుల నుండి దరకాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నేడోక ప్రకటనలో తెలిపారు. పబ్లిసిటీ అసిస్టెంట్ (వీడియో కెమెరామెన్) కొరకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి ఏదైనా డిగ్రీ అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఏపీ, తెలంగాణ స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ద్వారా జారీ చేసిన సినీ ఫోటోగ్రఫీ అర్హత ఉన్నవారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పబ్లిసిటీ అసిస్టెంట్ ( ఫోటోగ్రఫర్) కొరకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి ఏదైనా డిగ్రీ అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆరట్స్ నుండి ఫోటోగ్రఫీలో డిప్లమా లేదా ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి జర్నలిజం లో డిప్లమా అర్హత గల వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు వరంగల్ జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో ఈ నెల 12 బుధవారం



సాయంత్రం 5.00 గంటల లోగా విద్యార్హతల జిరాక్స్ కాపీలు జత చేసి తమ దరఖాస్తును సమర్పించాలని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు 27 వేల 130 రూపాయలు వేతనం చెల్లించబడుతుందని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

### హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి

హనుమకొండ, నవంబర్ 9, మేజర్ న్యూస్ సూర్య: వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం వృత్తి విద్యలో శిక్షణ పొందిన యువతి, యువకులకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మర్కజీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష వారి సౌజన్యంతో ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల హనుమకొండలో జాబ్ మేళాను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.వెంకట్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఇంజనీరింగ్ చదవడం ద్వారా మాత్రమే కాకుండా వృత్తి




విద్యలను అభ్యసించడం ద్వారా కూడా యువత నైపుణ్యాలను పెంచుకొని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందవచ్చునని తెలిపారు. అదే విధంగా వివిధ







ప్రైవేట్ కంపెనీలు ప్రభుత్వ పాఠశాలలో వృత్తి విద్యలను అభ్యసించే విద్యార్థుల కొరకు అవకాశాలను ఇచ్చి వారి నైపుణ్యాలను పెంపొందించుకునే విధంగా అవకాశాలను కల్పించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో 2015 సంవత్సరం నుండి ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశపెట్టిన ఈ వృత్తి విద్యా కోర్సులు 2030 నాటికల్లా అన్ని పాఠశాలకు విస్తరించనున్నట్లు అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి తెలిపారు. జాబ్ మేళా ప్రారంభోత్సవ కార్యక్రమం లో ప్రభుత్వ మర్కజీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వి. రామారావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ 1200 మంది నిరుద్యోగ యువత ఉద్యోగం కొరకు ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతీ రాష్ట్రంలో సమగ్ర శిక్ష పరిధిలో వివిధ ప్రభుత్వ పాఠశాలలో వృత్తి విద్యను అభ్యసించిన యువతీ, యువకులకు ఈ జాబ్ మేళా ద్వారా ఉద్యోగాలు ఇవ్వడం కొరకు 24 ప్రైవేట్ కంపెనీలు ఇక్కడికి వచ్చాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వృత్తి విద్య కోఆర్డినేటర్ బి. నాగేశ్వరరావు మాట్లాడుతూ వృత్తి విద్యను అభ్యసించడం ద్వారా యువత తమ యొక్క నైపుణ్యాలను పెంచుకొని స్వయం ఉపాధిని పొందవచ్చునని, అదేవిధంగా ప్రభుత్వం కూడా వృత్తి విద్యలను ప్రభుత్వ పాఠశాలలో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏ ఏం ఓ డాక్టర్ బి మన్మోహన్ , హనుమకొండ మండల విద్యాశాఖ అధికారి జి.నెహ్రూ నాయక్, ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు వి. జగన్నాథం, వివిధ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ఒకేషనల్ టీచర్స్, ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు,ఎన్సిసి క్యాడెట్లు అధిక సంఖ్యలో ఉద్యోగార్థులు పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణం అంతా ఉద్యోగాల పర్వదినంగా కోలాహాలంగా కనిపించింది. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో వివిధ కంపెనీలకు ఎంపికైన 214 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఉద్యోగాలు పొందిన వారందరు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లోని వృత్తి విద్య ను అభ్యసించడమే ఈనాటి మా విజయానికి కారణమని పేర్కొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ కే ప్రజల మద్దతు

**బీజేపీని గెలిపించేందుకు తహతహలాడుతున్న బీఆర్ఎస్**

**గత ఎంపీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు పనిచేసిన బీఆర్ఎస్ పార్టీ**

**ఓటమి తప్పదని తెలిసే కాంగ్రెస్ పార్టీ పై ఇరు పార్టీల తప్పుడు ప్రచారం**

**ఈ రెండు పార్టీల పట్ల జూబ్లీహిల్స్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు**



హనుమకొండ టౌన్, నవంబర్ 9, మేజర్ న్యూస్ సూర్య: జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్కు మద్దతుగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు ఇంటింటి ప్రచారం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా వెంగళరావు నగర్ 99వ డివిజన్ పరిధిలోని 211, 212, 213, 214, 215, 216 బూతుల పరిధిలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఇంటింటి ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాజీ గద్వాల జెడ్పీ చైర్మన్ సరిత తిరుపతయ్య, కామారెడ్డి మున్సిపల్ ఛైర్పర్సన్ హిందూ ప్రియాలు ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచార కార్యక్రమంలో ఇంటింటికి వెళ్తున్న ఎమ్మెల్యే నాగరాజు ను ప్రజలు సాధారణంగా ఆహ్వానించి శాలువాతో సత్కరిస్తూ వారి సమస్యలను తెలుసు కుంటూ ప్రధానంగా కాలనీలో నీటి, విద్యుత్ వైర్ల సమస్యలు ఉన్నాయని నా దృష్టికి వచ్చిందని అభ్యర్థి గెలిచిన వెంటనే సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలియజేస్తూ ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చేతి గుర్తుకు ఓటు వేసి నవీన్ యాదవ్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.జూబ్లీహిల్స్ ప్రజల ఆత్మవిశ్వాసం కాంగ్రెస్ పక్షాన స్పష్టంగా కనిపిస్తోంది. గత ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు బీఆర్ఎస్ తెర వెనుక పనిచేసింది. ఈ సారి కూడా బీజేపీకి లాభం చేకూర్చేందుకు ఇరు పార్టీలు కలిసి కాంగ్రెస్పై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కానీ ప్రజలు ఈసారి ఆ మాయమాటలకు లోబడరు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ కే ప్రజల మద్దతు బీజేపీని గెలిపించేందుకు తహతహలాడుతున్న బీఆర్ఎస్ గత ఎంపీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు పనిచేసిన బీఆర్ఎస్ ఓటమి తప్పదని తెలిసే కాంగ్రెస్ పై ఇరు పార్టీల తప్పుడు ప్రచారం. ఈ రెండు పార్టీల పట్ల జూబ్లీహిల్స్ ప్రజలు అప్రమత్తంగా ఉంటూ నవంబర్ 11వ తేదీన జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలను ఎమ్మెల్యే నాగరాజు కోరారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఇన్చార్జులు, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు..





## బుగులోని వెంకటేశ్వర స్వామి జాతర హుండీలు లెక్కింపు

**సమకూరిన ఆదాయం రూ.12.22 లక్షలు**

రేగొండ, నవంబర్ 09, మేజర్ న్యూస్ (సూర్య): రేగొండ మండలంలోని తిరుమలగిరి గ్రామ శివారులో కొండల్లో వెలసిన శ్రీ బుగులోని వెంకటేశ్వర స్వామి వారి జాతర నవంబర్ 4 నుండి 8 వరకు ఘనంగా సాగింది. కాగా జాతర హుండీలను ఆదివారం జాతర ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ ఎన్.కవిత ఆద్వర్యంలో లెక్కించారు. ఈ సంవత్సరం జాతరకు రూ. 12,22,670 (పన్నెండు లక్షల ఇరవై రెండు వేల ఆరు వందల డెబ్బై రూపాయలు) ల భారీ ఆదాయం సమకూరింది. జాతర ఈవో బిల్ల శ్రీనివాస్, చైర్మన్ గంగుల రమణారెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. మొత్తం ఆదాయం నగదుతో పాటు భక్తులు స్వామి వారికి 2 గ్రాముల బంగారం, 208 గ్రాముల మిశ్రమ వెండిను కూడా కానుకగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్, జాతర చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఎన్.కవిత,రేగొండ ఎస్సైలు కే.రాజేష్, త్రిలోక్ నాథ్, అర్చకులు వెంకటేశ్వర్లు, ఈవో శ్రీనివాస్, చైర్మన్ రమణా రెడ్డి, మాజీ చైర్మన్ రొంటాల వెంకటస్వామి, జాతర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





## బుస్సాపూర్ లో దొంగల బీభత్సం

**5తులాల బంగారం, రూ.2.5లక్షల నగదు చోరీ**

**గంటల వ్యవధిలోనే నేరస్థులను పట్టుకున్న పోలీసులు**

ములుగు ప్రతినిధి, నవంబర్ 7, మేజర్ న్యూస్ సూర్య : ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం బుస్సాపూర్ లో దొంగల్ హల్చల్ చేశారు. ఇంట్లో ఎవరూలేని సమయం చూసి నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు గంటల వ్యవధిలోనే దొంగలను గుర్తించి సొత్తును రికవరీ చేశారు. గ్రామస్థులు, బాధితులు తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. బుస్సాపూర్ గ్రామానికి చెందిన పుల్యాల రజినీ అనే మహిళ ఇంటికి తాళం వేసి శనివారం రాత్రి అదే గ్రామంలో ఉన్న తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి నిద్రించింది. ఆదివారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చే సరికి తలుపులు తెరిచి ఉండటంతో అనుమానంవేసి ఇంట్లోకి వెళ్లి చూడటంతో బీరువా పగులగొట్టి ఉంది. ఇంట్లో నగదు, బంగారం కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. విచారణ చేపట్టిన పోలీసులు కేసు నమోదు చేసుకొని డాగ్ స్క్వాడ్ బృందంతో ఆధారాలు సేకరించారు. గ్రామంలో సైతం విచారణ చేపట్టిన పోలీసులు మూడు గంటల వ్యవధిలోనే దొంగలను గుర్తించి పస్రా పోలీస్ స్టేషన్ కు తరలించారు. వారి నుంచి చోరీకి గురైన నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. కాగా, గంటల వ్యవధిలోనే చోరీకి గురైన సొత్తును రికవరీ చేసిన పస్రా ఎస్సై, పోలీసు సిబ్బందిని ఎస్పీ శబరీష్, డీఎస్పీ రవీందర్ అభినందించారు.

# పెరిగిన కూరగాయల ధరలు



**ప్రియంగా మారిన ఆకుకూరలు, బీన్స్ రకాలు**

**వర్షాలతో పంటలు దెబ్బతినడం, కార్తీకమాసంలో వినియోగం పెరగడం కారణం**

**బీరకాయలు, కాకరకాయలు కిలో రూ.50**

**వంకాయలు రూ.50-70**





వెంకటాపురం నూగూరు నవంబర్ 9 సూర్య మేజర్ న్యూస్ : ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో వరుసగా నాలుగు రోజులు భారీ వర్షాలు కురవడంతో రాష్ట్రంలో చాలాచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. వాటి ప్రభావం బజార్లలో కనిపిస్తోంది.ఆకుకూరలన్నీ ప్రియమైపోయాయి. వర్షాలకు ముందు పది రూపాయలకు రెండు తోటకూర కట్టలు లభించేవి. ఇప్పుడు ఒక కట్ట ఇరవై రూపాయలకు అమ్ముతున్నారు. పాలకూర అయితే దొరకడమే కష్టంగా ఉంది. మెంతి కూర రూ.30 పెడితే నాలుగు చిన్నకట్టలు ఇస్తున్నారు. మార్కెట్లో టమాటా రేటు కిలో రూ.30కి అటుఇటుగా నడుస్తోంది. లారీల్లో ఎక్కువ సరకు వస్తే రూ.24 నుంచి రూ.26కు, రాకపోతే కిలో రూ.30 చొప్పున అమ్ముతున్నారు. బంగాళాదుంపలు, ఉల్లిపాయలు కిలో రూ.19 నుంచి రూ.20కి లభిస్తున్నాయి. ఈ మూడింటి ధరలే ధరలే ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి.వంకాయల ధర అధికంగా ఉంది. తెలుపు రకం కిలో రూ.50, నలుపైతే రూ.70 చొప్పున అమ్ముతున్నారు. బెండకాయలు కిలో రూ.30కి లభించేవి. ఇప్పుడు రూ.50 పలుకుతున్నాయి. దొండకాయలు కూడా కిలో రూ.40 నుంచి రూ.50 మధ్య అమ్ముడవుతున్నాయి. బీరకాయలు, కాకరకాయలు కిలో రూ.40లోపే ఉండేవి. ఇప్పుడు కిలో రూ.50కు అమ్ముతున్నారు. క్యారెట్ రేటు రూ.40 నుంచి రూ.60కి పెరిగింది. బీన్స్ రకాలు కిలో రూ.40కే ఇచ్చేవారు. ఇప్పుడు అవి డబుల్ రేటు పలుకుతున్నాయి. కిలో రూ.70 నుంచి రూ.80కి విక్రయిస్తున్నారు. ఆనపకాయ చిన్నదైతే రూ.20, పెద్దదైతే రూ.30కి దొరికేది. ఇప్పుడు వాటిని రూ.40 కంటే తక్కువకు ఇవ్వడం లేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో బీర, బెండ, దొండ, ఆనప పండిస్తున్నారు. వీటిని రైతులు పది రూపాయలు అటుఇటుగా అమ్మేసి త్వరగా ఇంటికి వెళ్లిపోతున్నారు. ఇతర జిల్లాల నుంచి హోల్సేల్ వ్యాపారులు తెప్పిస్తున్న బీన్స్ రకాలు, క్యారెట్, బీట్రూట్ తదితరాల ధరలు అధికంగానే ఉన్నాయి. ఇది కార్తీకమాసం, అయ్యప్ప స్వాముల దీక్షలు ప్రారంభం కావడంతో అత్యధికులు శాకాహారమే తీసుకుంటున్నారు. దాంతో కూరగాయల వినియోగం బాగా పెరిగింది. రేటు ఎక్కువ పెట్టినా తప్పనిసరిగా కొంటారనే ధీమా ఉండడంతో హోల్సేల్ వ్యాపారులు డిమాండ్కు సరిపడా సరకులు తెప్పించకుండా కొంచెం తక్కువ రప్పిస్తూ కృత్రిమ డిమాండ్ సృష్టించి అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. దీనిపై వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులు దృష్టి పెడితే సరకుల లభ్యత పెరిగి ధరలు తగ్గుతాయి.

## గణపురం మండల కేంద్రంలో ఘనంగా ఎమ్మెల్యే గండ్ర జన్మదిన వేడుకలు



గణపురం రూరల్, నవంబర్ 09 మేజర్ న్యూస్ సూర్య: భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జన్మదిన వేడుకలు ఆదివారం గణపురం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు రేపక రాజేందర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కొండబోయిన కుమార్ యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ విడిదీనేని అశోక్, ఎండి చోటే మియా, మామిండ్ల మల్లికార్జున్ గౌడ్,మహిళ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు బల్గూరి సరస్వతి, ఓరుగంటి కృష్ణ గౌడ్, పోశాల మహేష్ గౌడ్, కట్కూరి శ్రీనివాస్, మాదాటి నారాయణరెడ్డి, ఆరుముల్ల ఎల్ల స్వామి, వడ్లకొండ నారాయణ గౌడ్, మాజీ ఎంపీపీ ఎర్రబెల్లి రామేశ్వరరావు, సుంకరి సుధాకర్ రెడ్డి, భూక్య రాజు నాయక్, దూడపాక పున్నం,పోశాల మహేష్ గౌడ్, నేరెళ్ల రాజు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వచ్చి కొత్త పంథా లో కమ్యూనిస్టులతో కలిసి పని చేయాలి

**లొంగిపోయిన మావోయిస్టులు బూర్జువ పార్టీలో చేరకుండా గతంలో లా జరగకుండా కమ్యూనిస్టులతో కలిసి ముందుకు సాగాలి**

**దేశంలో కార్పొరేట్ దోపిడీ శక్తులు వ్యతిరేకంగా పోరాడడానికి కమ్యూనిస్టులు అంతా ఏకం కావాలి**

**రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు**




మహబూబాబాద్ టౌన్, నవంబర్ 9, మేజర్ న్యూస్: మహబూబాబాద్ జిల్లా కేంద్రం లోని భారత కమ్యూనిస్ట్ పార్టీ జిల్లా కార్యాలయం వీర భవన్ హాలో సిపిఐ ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మావోయిస్టులు జనజీవనస్రవంతి లో కలిసి కమ్యూనిస్టులతో కలసి పనిచేయాలని అన్నారు .దేశంలో కార్పొరేట్ పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాడడానికి వామపక్ష పార్టీలు ఏకమై పోరాటం సాగించాలన్నారు. అడవుల్లో మావోయిస్టులు సాయుధ పోరాట పందాలు సాయుధ పోరాట పందాను వీడి కొత్త పందాలు వామపక్షాలతో కలిసి పనిచేయాలన్నారు. దేశంలో ఓట్ల చోరీ చేసి మూడోసారి బిజెపి అధికారంలోకి వచ్చింది కానీ ఓట్ల చోరీ కాకుండా ఎన్నికలు జరిగితే బిజెపి కేవలం 100 సీట్లు వచ్చే అన్నారు. రానున్న కాలంలో బిజెపి ఓటమి తధ్యమని బీహార్లో ఓటమి అంచుల్లో బిజెపి కూటమి ఉందన్నారు. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ కు మద్దతు ఉందన్నారు. ఐదు లక్షల మందితో జరిగే సిపిఐ శతాబ్ది సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి అజయ్ సారథి రెడ్డి ,నల్లు సుధాకర్ రెడ్డి, కట్టబోయిన శ్రీనివాస్, పెరుగు కుమార్, దేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వరిపల్లి వెంకన్న, కరణం రాజన్న, మామిండ్ల సాంబలక్ష్మి, చొప్పరి శేఖర్ ,జంపాల వెంకన్న ,సారిక శ్రీనివాస్, వీరవెల్లి రవి , వెలుగు శ్రావణ్, ఎండి ఫాతిమా, మాలోతు రవీందర్ ,ఆబోతూ అశోక్ ,లింగ్య నాయక్, జలగం ప్రవీణ్, వంకాయలపాటి చిరంజీవి ,కుమ్మ నారాయణ ,తూటి వెంకటరెడ్డి, తండ సతీష్ తదితరులు పాల్గొన్నారు



# జూబ్లీహిల్స్ ప్రచారంలో గోవిందరావుపేట కాంగ్రెస్ నేతలు



## ప్రజల్లో చైతన్యం రేపిన ప్రచారం



ములుగు ప్రతినిధి, నవంబర్9, మేజర్ న్యూస్ సూర్య :జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో జరుగుతున్న ఎన్నికల ప్రచార కార్యక్రమంలో గోవిందరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని పార్టీ తరపున విస్తృత ప్రచారం నిర్వహించారు. కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, చాపల ఉమాదేవి నరేందర్, గుండెబోయిన అనిల్ యాదవ్,



చింత క్రాంతి, చిక్కుల వెంకటేశ్ తదితరులు బోరబండా ప్రాంతంలోని వివిధ కాలనీలు, బస్తీల్లో ప్రజలతో నేరుగా కలసి కాంగ్రెస్ పార్టీపై విశ్వాసం ఉంచాలని కోరారు. ప్రచారంలో భాగంగా వారు ఇంటి ఇంటికి వెళ్లి పార్టీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగాలంటే, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే కాంగ్రెస్ పార్టీనే జూబ్లీహిల్స్ లో గెలిపించేలా ప్రజలు నిర్ణయించాలన్నారు. చాపల ఉమాదేవి నరేందర్ మాట్లాడుతూ మహిళలు, విద్యార్థులు, యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రచారంలో యువత, మహిళలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా నినాదాలు చేశారు.



# ఘనంగా ఎమ్మెల్యే జీఎస్ఆర్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి బాణాసంచా కాల్చిన కాంగ్రెస్ శ్రేణులు

టేకుమట్ల నవంబర్ 09 మేజర్ న్యూస్ సూర్య: భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు జన్మదిన వేడుకలను టేకుమట్ల మండల కేంద్రం లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కోటగిరి సతీష్ గౌడ్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి బాణసంచా కాల్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ప్రజలు మెచ్చిన ప్రజా నాయకుడని, నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టితో పరిపాలన కొనసాగిస్తున్నారని, ఆపదలో ఉన్న ప్రతి వ్యక్తికి అందుబాటులో ఉంటూ ఆపన్న హస్తం అందిస్తున్న మహోన్నతమైన వ్యక్తి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అని, ఆయన ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆ భగవంతున్ని వేడుకుంటున్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వైనాల రవీందర్, యువజన కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షులు బండ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దొంతుల శ్రీనివాస్, తోట గట్టయ్య, కాంగ్రెస్ పార్టీ మండల కోశాధికారి శాస్త్రాల కిరణ్,కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు



మాదం కొమురయ్య, మోతే రాజమౌళి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వంగ నరేష్,సంగి రవి, కోరే చందు, పోలు దాసరి రాజేశం, కొయ్యల చిరంజీవి, బొల్లెపల్లి శ్రీకాంత్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొలుగూరి అనిల్, కాంగ్రెస్ పార్టీ టేకుమట్ల టౌన్ అధ్యక్షులు పెరుమాండ్ల క్రాంతి, బోనగిరి తిరుపతి, దూడం రాములు,దాసరి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# తేమశాతాన్ని పాటించి గిట్టుబాటు ధర పొందాలి

## మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారిని మనస్విని



రాయపర్తి నవంబర్ 9 మేజర్ న్యూస్ సూర్య : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తేమశాతాన్ని పాటించి ప్రభుత్వం అందిస్తున్న గిట్టుబాటు ధరను పొందాలని మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారులు మనస్విని క్రాంతి కుమార్ కావ్య సాయి రాజేష్ మనస్విని రైతులను కోరారు మండలంలోని మైలారం, బురహాన్ పల్లి, రాయపర్తి, రాగన్నగూడెం గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మండల ఏఈ వోలు సందర్శిం చారు. ధాన్యం నాణ్యత, తేమ శాతాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి 17 శాతానికి తేమ మించకుండా కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. లాభాపేక్ష లేకుండా కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్న మహిళా సంఘాలకు రైతులు సహకరించాలని కోరారు. రైతులు ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు

## ఏషియన్ యూత్ గేమ్స్ లో సత్తా చాటిన లోడంగ రాము



స్టేషన్ ఘనపూర్, నవంబర్ 09,మేజర్ న్యూస్(సూర్య):గత నెల 24 న బెహ్రాన్ లోని మనామాలో జరిగిన 3వ ఎసియన్ యూత్ గేమ్స్లో స్టేషన్ ఘనపూర్ మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన లోడంగ రాము భారత్ తరపున పాల్గొని ఫైనల్ మ్యాచ్ లో 400 మీటర్ల పరుగు పందెంలో ఐదవ స్థానంలో నిలిచాడు.ఏషియన్ గేమ్స్ లో రాము మనదేశ ప్రతినిధిగా సత్తా చాటాడు. ఈ సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదివారం రామును శాలువాతో సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ఇంచార్జ్ నాగరబోయిన శ్రీరాములు, నాయకులు జూలుకుంట్ల రాజశేఖర్ రెడ్డి, మంద రాజు, మేకల రాజు, మధు,కాసాని శ్రీకాంత్ తదిరులు పాల్గోన్నారు.

## రామప్ప ను సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు



వెంకటాపూర్(రామప్ప) నవంబర్ 9 మేజర్ న్యూస్ సూర్య: ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలోని పాలంపేట లో గల ప్రపంచ ప్రాఖ్యాతిగాంచిన రామప్ప దేవాలయాన్ని ఆదివారం ట్రైనీ ఐఏఎస్ అధికారులు సందర్శించగా వారికి ఆలయ పూజారులు హరీష్ శర్మ, ఉమాశంకర్లు ట్రైనీ ఐఏఎస్ అధికారులతో రామలింగేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసా దాలు అందజేశారు. అనంతరం గైడ్ విజయ్ కుమార్ వారికి రామప్ప శిల్ప సంపద చరిత్రను వివరించగా.రామప్ప శిల్ప సంపద మహా అద్భుతం కాకతీయుల కాలంనాటి రామప్ప దేవాలయం, శిల్ప సంపద అద్భుతంగా ఉందని ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కొనియాడారు. అనంతరం రామప్ప సరస్సులో బోటు షికారు చేస్తూ ఉల్లాసంగా గడిపారు. వారితో వెంకటాపూర్ ఎస్సై చల్లా రాజు, మరియు సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# నెక్కొండలో ఘనంగా సాగిన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

నెక్కొండ,నవంబర్ 9 మేజర్ న్యూస్(సూర్య): నెక్కొండలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు సాగాయి. కార్తిక మాసోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా ఆలయంలో సామూహికంగా శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు కొనసాగుతున్నాయి.ఆలయ అర్చకులు బివిఎన్ శాస్త్రి ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాలతో రుద్రాభిషేకాలు నిర్వహించిన అనంతరం ఆలయంలో కొలువుతీరిన శ్రీ సీతారామచంద్ర స్వామి, శ్రీవల్లి దేవసేన సమేత





సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, గోమాతలకు విశేష పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం వేళ భక్తులు సామూహికంగా శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలను నోముకొని ఆలయంలో కొలువు దీరిన దేవతామూర్తులకు మొక్కులను చెల్లించారు. శ్రీ రామలింగేశ్వర సేవా సమితి బాధ్యులు డింగిరి శేష పవన్ కుమార్ , గందె రాజు,లెక్కల సుధాకర్ రెడ్డి, మోదుగుల రుద్ర శేఖర్ రెడ్డి తదితరులు సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్నారు





# రక్తదానంతో మిన్నంటిన జీఎస్సార్ జన్మదిన వేడుకలు

## నాయకుడు పుల్లూరి బాబురావు ఆధ్వర్యంలో సేవా శిబిరం - 50 మంది రక్తదానం

రేగొండ, నవంబర్ 09, మేజర్ న్యూస్ (సూర్య): భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు(జీఎస్సార్)జన్మదిన వేడుకలు ఈసారి సేవా కార్యక్రమాలతో మిన్నంటాయి. మండల కేంద్రంలోని గుడ్ లైఫ్ స్కూల్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పుల్లూరి బాబురావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు శిబిరాన్ని ప్రారంభించి, ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం సుమారు 50 మంది రక్తదానం చేశారు. భూపాలపల్లి జిల్లా 100 పడకల ఆసుపత్రి సిబ్బంది రక్త సేకరణ నిర్వహించగా, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. హిమబిందు సిబ్బందితో కలిసి సేవలందించారు. ఈ సందర్భంగా పుల్లూరి బాబురావు మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి పట్ల ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి క్షణం ఆగకుండా పనిచేసే మనసున్న నాయకుడని, ఈ పుట్టినరోజు సందర్భంగా ప్రజల తరపున శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్పకాల నర్సయ్య, ఎన్ఎస్ఆర్ సంస్థల చైర్మన్ నాయినేని సంపత్ రావు, కోటంచ ఆలయ చైర్మన్ ముల్కనూరు బిక్షపతి, నాయకులు ఉమేష్ గౌడ్, పున్నం రవి, ఎర్రబెల్లి రవీందర్ రావు, పట్టెం శంకర్, బల్గురి రాజు, చిగురు మామిడి కుమారస్వామి, మటిక సంతోష్, పాతపెల్లి సంతోష్, వీరబ్రహ్మం, మేకల రవికుమార్, బండారి దేవేందర్, మేకల బిక్షపతి, మైస బిక్షపతి,





ఏనుగు రవీందర్ రెడ్డి, కోలేపాక సాంబయ్య, బొజ్జం రవి, కోయిల క్రాంతి, గండి తిరుపతి, ముదురు కొల్ల తరుణ్, కొమ్రరాజు భాస్కర్, పున్నం సాయి, మేకల శివ, చిలువేరు విష్ణు, పున్నం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్ఎస్ క్యాంపును సందర్శించిన కళాశాల సిడిసి చైర్మన్




జనగామ టౌన్ నవంబర్ 9మేజర్ న్యూస్ సూర్య : ప్లాస్టిక్ మానవ జాతి మనుగడకు ప్రమాదం కళాశాల సి డి సి చైర్మన్ గట్టు వెంకటేశ్వర్లు పచ్చని చెట్లు ప్రగతికి ప్రతీక జూనియర్ కాలేజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మరిపెల్ల రవిప్రసాద్ మానవజాతి మనుగడకు పెనుముప్పుగా పరిణమించిన ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలని జనగామ జిల్లా యశ్వంతాపూర్ మండలం ప్రాథమిక పాఠశాలలో నడుస్తున్న ప్రత్యేక ఎన్ఎస్ఎస్ క్యాంపు ఆరవ రోజును సందర్శించిన కళాశాల సిడిసి చైర్మన్ గట్టు వెంకటేశ్వర్లు అన్నారు. గట్టు వెంకటేశ్వర్లు వాలంటీర్లతో మాట్లాడుతు వారు చేసిన సేవలను కొనియాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలను తెలిపి, వాటి వాడకం వలన ఆరోగ్యానికి ప్రమాదకరమని, వాతావరణ%శీ%పై తీవ్ర ప్రభావం చూపుతుందని అందరికి తెలిసిన వినియోగం తగ్గుతలేదని ప్రజలలో ప్లాస్టిక్ వాడకం పైన అవగాహన పెంచి, తగ్గించే బాధ్యత వాలంటిర్ల పై ఉందని అన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ మరిపెల్ల రవిప్రసాద్ ఆధ్వర్యంలో స్కూల్ ఆవరణలో వాలంటీర్స్ తో కలిసి మొక్కలు నాటారు. వాలంటీర్స్ తో పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని,పర్యావరణాన్ని పరిరక్షించడం కోసం ప్రతి ఒక్కరూ ఒక్కో చెట్టును నాటి పర్యావరణ పరిరక్షణ కోసం పాటు పడాలని, మన పరిసరాలను మనమే కాపాడుకోవాలన్నారు.




# టిప్పర్ ఢీకొని ఒకరి దుర్మరణం

## - మంగళపల్లి-ముల్కనూర్ రోడ్డుపై ఘోర ప్రమాదం
## - రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు

భీమదేవరపల్లి, నవంబర్ 09(మేజర్ న్యూస్ సూర్య): భీమదేవరపల్లి మండల పరిధిలోని మంగళపల్లి-ముల్కనూర్ ప్రధాన రహదారిపై ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. టిప్పర్ ఢీకొట్టడంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థుల సమాచారం మేరకు మంగళపల్లి గ్రామానికి చెందిన బసిరెడ్డి శ్రీనివాస్ (48) ఆదివారం సెలవు దినం కావడంతో తన మనువళ్లు రిషి, రక్షిత్‌లను ద్విచక్రవాహనంపై తీసుకుని ముల్కనూర్ దిశగా బయల్దేరాడు. ఈ క్రమంలో ఎల్కతుర్తి వైపు నుంచి అతివేగంగా వస్తున్న టిప్పర్ వారి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకుని రహదారిపై ఆందోళనకు దిగారు. టిప్పర్లు అతివేగంగా నడపడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఖాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి, సీఐ రమేష్ ఆందోళన కారులను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. మృతుని కుటుంబానికి న్యాయం జరగేలా చర్యలు తీసుకుంటామని ఏసిపి హామీ ఇవ్వడంతో



ఆందోళన ముగిసింది. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వంగర ఎస్ఐ దివ్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే





కాజీపేట, నవంబర్ 9, మేజర్ న్యూస్ సూర్య : మడికొండ లోని రెడ్డి కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన కాజీపేట ఏ.ఎన్ రెడ్డి నగర్ కు చెందిన అడ్వకేట్ కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి కుమార్తె వివాహ వేడుకకు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

# శ్రీ వినాయక యూత్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

## - అధ్యక్షులుగా నారబోయిన రమేష్
## - ప్రధాన కార్యదర్శిగా మేకల సురేష్



కేసముద్రం,నవంబర్ 9: కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రం విలేజ్ లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశం లో శ్రీ వినాయక యూత్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కమిటీ అధ్యక్షునిగా నారబోయిన రమేష్, ప్రధాన కార్యదర్శిగా మేకల సురేష్,గౌరవ అధ్యక్షులుగా చింతనూరి సతీష్, ఉపాధ్యక్షులుగా డొనికల రాజు, కోశాధికారిగా వెన్ను బిక్షపతి,గౌరవ సలహాదారు లుగా కీర్తి రజిని,ఎస్.కె రహమాన్, కార్యవర్గ సభ్యులుగా ఎండి యాకూబ్ పాషా, ఎండి అయూబ్ లను సంఘ సభ్యులు ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రమేష్,ప్రధాన కార్యదర్శి మేకల సురేష్ మాట్లాడుతూ... గత 17 సంవత్సరాలుగా దిన దినాభివృద్ధి చెందుతున్న వినాయక యూత్ అసోసియేషన్ మరింత ముందుకు వెళ్లేందుకు తమ వంతు కృషి చేస్తామని, సంఘాన్ని అందరికీ ఆదర్శంగా నిలుపుతామని తెలిపారు. తమ ఎన్నికకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్క సంఘ సభ్యునికి నూతన కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు అల్వాల కుమార్,జవ్వాజి బిక్షపతి,మేకల వెంకన్న, సముద్రాల మల్లయ్య, సుదగాని సతీష్,ఎండి మహమ్మద్,బోడ వీరన్న, ఎండి గుంశావలి, అమీర్,సాదిక్, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కనబడుటలేదు


## ఆచూకీ తెలిపిన వారికి తగిన పారితోషికం



గూడూరు నవంబర్ 9 మేజర్ న్యూస్ నవంబర్ 9 మేజర్ న్యూస్ సూర్య(సూర్య) మండలంలోని బ్రాహ్మణ పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని హముతాండ గ్రామానికి చెందిన ధరావత్ పుల్యా( 75) తండ్రి హాము 04-09-2025 రోజు నుండి కనబడుటలేదని ఎవరికైనా కనబడిన ఆచూకీ తెలిసినచో 8712656963, 9618732715, 9010716527, ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సమాచారం అందించిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును అని పుల్యా నాయక్ కుటుంబ సభ్యులు తెలిపారు.

# కనుమరుగవుతున్న పెద్ద తరం

- తరం వెళ్ళిపోతున్నది
- ఆ ప్రేమ అనురాగాలు కనుమరుగవుతున్నాయి
- సాంకేతికలో ముందుకు వెళ్తున్నాం
- విలువల్లో వెనుక ఉంటున్నాం





దంతాలపల్లి,నవంబర్ 9 మేజర్ న్యూస్ (సూర్య): ఒక్కొక్కరుగా మనకు శాశ్వత వీడ్కోలు పలుకుతూ ఒక తరం కనుమరుగవుతోంది.అన్నం తినేముందు ఇతరుల ఆకలిని గుర్తించిన తరం.ఇరుకు ఇళ్లల్లో గొప్ప ప్రేమతో బ్రతికిన తరం.బాధ్యతల్ని ఎరిగిన తరం. 'నేను' అనకుండా 'మనం' అంటూ బతికిన తరం.డిగ్రీలు లేకున్నా, జీవితాన్ని చదివిన తరం.గడియారం లేకున్నా, సమయాన్ని సద్వినియోగం చేసుకున్న తరం.ఇంటర్నెట్ చూడకుండా జ్ఞానాన్ని నింపుకున్న తరం.కాలిక్యులేటర్ లేకున్నా లెక్కలు చేయగలిగిన తరం.మొబైల్ ఫోన్ లు లేకున్నా స్నేహ సంభాషణలకు లోటు లేని తరం.టీవీలు లేకున్నా వినోదంగా కాలం గడిపిన తరం.జిపిఎస్ లు లేకున్నా గమ్యం ఖచ్చితంగా చేరగలిగిన తరం.సాంకేతికత లేకున్నా సుఖసంతోషాలతో బతికిన తరం.ఏసిలు, కూలర్లు లేకున్నా ఆరుబయట హాయిగా నిద్రించిన తరం.మినరల్ వాటర్ కు బదులు చెరువు/బావి నీళ్లు తాగి ఆరోగ్యంగా బతికిన తరం.పిజ్జాలు, బర్గర్లు కాకుండా పీచు మిఠాయిలు, పేలాలు తిని ఆనందంగా బ్రతికిన తరం.రాత్రిళ్ళు ఇంటి అరుగులపై హాయిగా కబుర్లు చెప్పుకుంటూ ఆనందంగా బ్రతికిన తరం.ఆరో ఏడు వచ్చే వరకు పిల్లల బాల్యాన్ని ఆటపాటలతో నింపిన తరం.ఆ తర్వాత పైసా ఫీజు లేని సర్కారు బడుల్లో తెలుగు మీడియంలో పిల్లలను చదివించి - అటు తెలుగు లోనూ, ఇటు ఇంగ్లీష్ లోనూ పండితులు అయ్యేలా పిల్లలను తీర్చిదిద్దిన తరం.కిలోమీటర్ల దూరాన్ని సైతం అవలీలగా నడవగలిగిన తరం.క్రమశిక్షణ తప్పిన పిల్లవాడికి స్కూల్ లో టీచర్ నాలుగు దెబ్బలు వడ్డిస్తే - వాడికి మరో పది దెబ్బలు ఇంట్లో వడ్డించిన తరం.వీధి నాటకాలను, తోలు బొమ్మలాటలను, బుర్రకథలను ఆస్వాదించిన తరం.సెన్సార్ అవసరం లేని సందేశాత్మక నలుపు-తెలుపు సినిమాలు చూసిన తరం.ఇంటి ముంగిటిని ముగ్గులతో అలంకరించిన తరం.పని మనుషులతో, యోగాలతో, జిమ్ లతో పని లేకుండా, బండెడు చాకిరీ చేసుకుంటూ, చెమటను చిందించి వందేళ్లు బతికిన తరం.బంధాలకు, బంధుత్వాలకు విలువనిచ్చిన తరం.ఆస్తులకన్నా, ఆప్యాయతలకు, అనుబంధాలకు ప్రాముఖ్యత నిచ్చిన తరం.ఉమ్మడి కుటుంబాలుగా ఆనందంగా జీవించిన తరం.భేదాభిప్రాయాలున్నా అందర్నీ కలుపుకుని వెళ్ళగలిగిన తరం.వ్యాపారంలో కల్తీకి చోటివ్వని తరం.ఇతరుల మేలు కోరుకున్న తరం.నీతి నిజాయితీలతో మోసాలు చెయ్యకుండా బతికిన తరం.రాళ్లు తిన్నా అరిగించు కోగలిగిన తరం.కార్పొరేట్ హాస్పిటల్స్ లేకున్నా ఆరోగ్యంగా జీవించిన తరం.హార్ట్ ఎటాక్, క్యాన్సర్ ల గురించి తెలియని తరం.బీపీలు, షుగర్ లను దరిచేరనీయని తరం.లాంతర్లతో జీవితంలో వెలుగులు నింపుకున్న తరం.కష్టాల్ని ధైర్యంగా ఎదుర్కొన్న తరం.ఎంత ఉన్నా ఇంకా ఇంకా కావాలనే దురాశ లేకుండా ఆనందంగా జీవించిన తరం.ఆడంబరాలకు దూరంగా ఉన్న తరం. పోస్ట్ కార్డులపై సంభాషణలు జరిపిన తరం.త్యాగాలతో పిల్లల భవిష్యత్ కు పునాదులు వేసిన తరం. కులమతాలకు అతీతంగా సోదరభావంతో బతికిన తరం.కాఫీ, టిఫిన్ లు లేకుండా చద్దన్నం తిని స్కూల్ కు పరుగెత్తిన తరం.....అలాంటి తరంలోని అపురూపమైన వ్యక్తులు నేడు ఒక్కొక్కరుగా మనల్ని విడిచి వెళ్లిపోతున్నారు.వారిని కోల్పోతుంటే సర్వం కోల్పోతున్నట్టుగా అనిపిస్తుంది.వెళ్లిపోతున్న ఆ తరం వాళ్ల నుండి ఈ తరం ఏమీ నేర్చుకోకపోతే - భవిష్యత్తు అంధకారమే!ఆ తరం నిజంగా మన సంస్కృతి, మన విలువల ప్రతిరూపం. వాళ్ల లాంటి మనసులు మళ్లీ రావు... వారిని కోల్పోవడం అంటే మన మూలాలను కోల్పోవడమే....ఆ తరం చూపిన విలువలు, ప్రేమ, నిజాయితీ ఈ తరం నేర్చుకోవాలి...సాంకేతికతతో ముందుకెళ్తున్నాం కానీ విలువలతో వెనక్కి వెళ్తున్నాం ఆ తరం మనకు మానవత్వం అంటే ఏమిటో నేర్పింది...లాంతర్ల కాంతిలో వెలుగులు నింపింది ఆ తరం - కరెంట్ దీపాల వెలుగులో చీకట్లు పెంచుకుంటోంది ఈ తరం.వాళ్లు మనకు నేర్పింది ప్రకృతి తో సహజీవనం. మనం నేర్చుకుంటున్నది యాంత్రిక జీవనం.ఔనా? కాదా? ఎవరికి వారు వేసుకోవలసిన ప్రశ్న.



## కాంగ్రెస్‌కు జూబ్లీహిల్స్ ఎన్నికలపై ఉన్న శ్రద్ధ


# పంట నష్టం జరిగిన రైతులపై లేదా

### - బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సిందే రామోజీ

కొడకండ్ల, నవంబర్ 09మేజర్ న్యూస్ (సూర్య): కాంగ్రెస్ ప్రభుత్వానికి, నాయకులకు జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంపై ఉన్న శ్రద్ధ మొంథా తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులపై లేదా అని బీఆర్ఎస్ కొడకండ్ల మండల పార్టీ అధ్యక్షులు సిందె రామోజీ మండిపడ్డారు. 6 గ్యారంటీల హామీలతో ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి పంట నష్టం జరిగిన రైతులను పరామర్శించడానికి సమయం లేదా అని అన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ లో మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ ఒక్క రైతు కూడా సంతోషంగా లేడని రైతుల బాగోగులు చూసుకోలేని ఏ ప్రభుత్వం బాగుండదని రైతులకు అన్యాయం చేయొద్దని వెంటనే పంట నష్టం జరిగిన రైతులను పరామర్శించి నష్టపరిహారం అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులు కృషి చేయాలని అన్నారు.



## హైకోర్టు న్యాయవాదిగా శ్రీనివాస్



మరిపెడ,నవంబర్ 09,మేజర్ న్యూస్(సూర్య): మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం దంటకుంట తండాకు చెందిన భూక్య శ్రీనివాస్ నాయక్ తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయవాదిగా ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. గిరిజన ప్రాంతం, మారుమూల తండా నుంచి ప్రస్థానాన్ని ప్రారంభించి క్రమశిక్షణతో నిబద్ధతతో ఉన్నత చదువులు చదివి న్యాయశాఖలో రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో న్యాయవాదిగా చేరారు. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం మహబూబాబాద్ జిల్లాలో పూర్తి చేయగా లా విద్యను సంగారెడ్డిలోని టి టి డబ్ల్యూ ఆర్ కళాశాల నుంచి పూర్తి చేసినట్లు తెలిపారు. న్యాయవిద్య పూర్తి అనంతరం హైకోర్టులో న్యాయవాదిగా ప్రమాణస్వీకారం చేసినట్లుగా తెలిపారు.మొత్తం రాష్ట్రం నుంచి 800 మంది ప్రమాణ స్వీకారం చేయగా మహబూబాబాద్ జిల్లా నుంచి ఇద్దరు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఈ స్థాయికి ఎదగడానికి కృషి చేసిన తల్లిదండ్రులకు గురువులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తన వృత్తిలో నిబద్ధతతో సమాజానికి న్యాయం సేవ సమానత్వం అందించేందుకు కృషి చేస్తానన్నారు.

## మిత్రుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

### - ఆపదలో మేమున్నామంటూ భరోసా ఇచ్చిన తోటి మిత్రులు



పెద్దవంగర, నవంబర్ 9 (సూర్య న్యూస్): ఆపదలో మేమున్నామంటూ చనిపోయిన మిత్రుని కుటుంబానికి తోటి మిత్రులు ఆర్థిక చేయూతనందించారు. పెద్ద వంగర ఉన్నత పాఠశాలలో 1997-98 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులలో పెద్దవంగర మండలం పోచారం గ్రామం బద్రు తండాకు చెందిన తోటి మిత్రుడు ధరావత్ సోమని (41 )ఇటీవల మృతిచెందగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపి 21 వేల రూపాయలను మిత్రుల నుండి సేకరించి ఆది వారం మృతుడి భార్యకు అందించారు. ఈ సందర్భంగా బాల్యమిత్రులు మాట్లాడుతూ ఈ లోకంలో స్నేహానికన్న మిన్న ఏదీ లేదని, కష్టసుఖాలలో పాలు పంచుకునే ఏకైక వ్యక్తి ఒక స్నేహితుడు మాత్రమేనని, మా అందరి మధ్యలో నుండి సోమని దూరం కావడం, అతని చెరగని స్మృతులను మరిచి పోలేకపోతున్నామని గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఆర్థిక సహాయం చేసిన వారిలో కొమురమల్లు, సంపత్, రాము, సోమన్న, శ్రీనివాస చారి, లక్ష్మణ్, మేనక, రోజా, లలిత, కళ్యాణి, నాగమణి, ఉదయ్, కుమార్, నరేష్, రమేష్, మురళి, సుధాకర్, రమేష్, రామకృష్ణ, గోపాల్, స్వామి, ఎర్రన్న, మహేందర్ తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర స్థాయిలో గోల్డ్ జాతీయ స్థాయికి ముల్కనూర్ ఆదిత్య

### - ప్రశంసించిన ఏకెవిఆర్ కళాశాల యాజమాన్యం



భీమదేవరపల్లి, నవంబర్ 09(మేజర్ న్యూస్ సూర్య): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన మాడుగుల ఆదిత్య క్రీడారంగంలో ప్రతిభ చాటాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్ లోని జింఖానా గ్రౌండ్ లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 19 క్రీడా పోటీలలో 400 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్ సాధించి కీర్తి సాధించాడు. ఈ విజయంతో ఆదిత్య జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ మేరకు ఆదివారం ఏ.కె.వి.ఆర్ కళాశాల కరస్పాండెంట్ సుదర్శన్ రెడ్డి, ప్రిన్సిపాల్ భూపతి శ్రీకాంత్, ఆదిత్యను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి కృషి, పట్టుదల అభినందనీయమని పేర్కొన్నారు. ఈ నెల 25న హర్యానాలో జరగనున్న జాతీయ స్థాయి క్రీడా పోటీలలో ఆదిత్య పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు జాతీయస్థాయిలో గెలుపొందాలని ఆకాంక్షించారు.

# వసతిగృహాల్లో విద్యార్థుల సమస్యలపై
# ప్రభుత్వం దృష్టి సారించాలి

**– ఆకుల మనోజ్**




భీమదేవరపల్లి, నవంబర్ 09(మేజర్ న్యూస్ సూర్య): వసతిగృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల మనోజ్ డిమాండ్ చేశారు. ఆదివారం యూఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో భీమదేవరపల్లి ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడిన ఆయన హాస్టల్‌లో మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చలికాలం ప్రారంభమైనా విద్యార్థులకు దుప్పట్లు ఇవ్వలేదని, వేడి నీటికి గ్రీజర్లు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భోజన మెనూ సక్రమంగా అమలు చేయడంలేదని, ఆట పరికరాలు అందుబాటులో లేవని అన్నారు. రాత్రివేళల్లో నైట్ వాచ్‌మన్ లేక విద్యార్థులు భయాందోళనలో ఉన్నారని మనోజ్ ఆందోళన వ్యక్తం చేశారు. అత్యవసర సమయంలో ఎవరికి సమాచారమివ్వాలో తెలియక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ సమస్యలు విద్యార్థులను చదువుల నుండి దూరం చేస్తూ మానసికంగా కూడా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు. హాస్టల్‌కు శాశ్వత నైట్ వాచ్‌మన్‌ను నియమించి, తక్షణమే అన్ని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ మండల నాయకులు విష్ణు, శివ, కోటి, నవీన్ మరియు ఇతరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అవినీతిపరులకు ఓట్లు వేస్తే
# రాష్ట్రం అధోగతి పాలవుతుంది

- పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసి శ్రీధర్
- ఎమ్మెల్యే రేవూరి ఆదేశాలతో జూబ్లీహిల్స్ లో ఇంటింటి ప్రచారం



ఆత్మకూరు నవంబరు 09, మేజర్ న్యూస్ (సూర్య) బీఆర్ఎస్ నేతల మాయమాటలు నమ్మి ఓట్లు వేస్తే రాష్ట్రం మళ్ళీ అధోగతి పాలవుతుందని పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసి శ్రీధర్ అన్నారు.పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకుయూత్ కాంగ్రెస్ సభ్యులతో కలిసి గత వారం రోజుల నుండి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మంత్రివర్యులు సీతక్క,అజారుద్దీన్ తోపాటు ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజ్, కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకుల తో కలిసి ఇంటింటి కి ముమ్మర ప్రచారం నిర్వహించారు. గత పది సంవత్సరాల క్రితం బిఆర్ఎస్ నేతల మాయమాటలు నమ్మి ఓట్లు వేసినందుకు రాష్ట్రాన్ని దోచుకుని ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోటే సాధ్యమవుతుందన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికతో టిఆర్ఎస్ నేతలకు బుద్ధి వచ్చే విధంగా అఖండ మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించాలని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి అనేక సంక్షేమ పథకాలను అర్హులైన నీరు పేదలకు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కే దక్కుతుందన్నారు. గత పది సంవత్సరాల్లో కేవలం టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలే ప్రభుత్వ పథకాలను మింగారని ఏ ఒక్క నిరుపేదకు సంక్షేమ పథకాలు అందలేదన్నారు.జూబ్లీహిల్స్ రాష్ట్రానికి ఆదర్శంగా అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు ఓట్లు వేయాలని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచారములో యూత్ నాయకులు ఎం క్రాంతి, రామక్రిష్ణ,రేగుల రాజు, శీలం నరేష్, పాషా, రాజు నాయకులు పాల్గొన్నారు.



## ఐటీడీఏ స్పెషల్ డీఎస్సీ ని ఏర్పాటు చేసి ఆదివాసీ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

**– ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వెనుక ప్రభాకర్**



గూడూరు నవంబర్ 9 మేజర్ న్యూస్ (సూర్య): ఐటీడీఏ స్పెషల్ డీఎస్సీ ని ఏర్పాటు చేసి ఆదివాసీ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వెనుక ప్రభాకర్ అన్నారు ఆదివారం రోజున మండల కేంద్రంలో ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులు ముయ్యబోయిన వెంకన్న అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరణ చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పెనుక ప్రభాకర్ మాట్లాడుతూ తక్షణమే ట్రైబల్ అడ్వైజర్ కమిటీ ఏర్పాటు చేసి జీవో నెంబర్ 3 ని పునరుద్ధరించి ఐటీడీఏ స్పెషల్ డిఎస్సి ని ఏర్పాటు చేసి ఆదివాసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, గిరిజన సంక్షేమ శాఖలో బదిలీలు పదోన్నతులు, భాషా పండితులు వ్యాయామ ఉపాధ్యాయుల అబ్రిడేషన్ సాధించాలని, ఈనెల 16వ తేదీన ఆసిఫాబాద్ జిల్లా జోడిఘాడ్ ప్రాంతంలో కొమరం భీమ్ నేలకొరిగిన గడ్డమీద జరగబోయే రాష్ట్ర మహాసభకు ఆదివాసి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో , మేడ వెంకన్న, రేగ సాంబయ్య, దారం వెంకటేశ్వర్లు,ఊకె లక్ష్మయ్య, మోయబోయిన పృథ్వీరాజ్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

## బాలోత్సవ్ 2025లో కూచిపూడి రంగంలో మెరిసిన రుత్విక ఖమ్మంపాటి





హనుమకొండ టౌన్, నవంబర్ 9, మేజర్ న్యూస్ సూర్య : బిర్లా ఓపెన్ మైండ్స్ విద్యార్థిని రుత్విక కూచిపూడి జూనియర్ లో మూడవ స్థానాన్ని సాధించి పాఠశాలకు గౌరవం తీసుకొచ్చింది. వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ యూనివర్సిటీలో జరిగిన "బాలోత్సవ్ 2025" సాంస్కృతిక వేడుకల్లో వరంగల్ బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ నాలుగో తరగతి విద్యార్థిని రుత్విక ఖమ్మంపాటి ఘన విజయం సాధించింది. కూచిపూడి నృత్యం (సబ్ జూనియర్ కేటగిరీ)లో ఆకట్టుకునే ప్రదర్శనతో మూడవ స్థానం గెలుచుకొని తన ప్రతిభను చాటుకుంది.సుమారు 180 మంది బాల కళాకారులు పాల్గొన్న ఈ నృత్య పోటీల్లో ప్రజా, శాస్త్రీయ, ఆధునిక నృత్య ప్రక్రియల్లో 20కి పైగా విభాగాలు నిర్వహించారు. రుత్విక ప్రదర్శనలోని సౌందర్యం, భావవ్యక్తీకరణ, స్టేజ్ ప్రెజెన్స్ జడ్జీలను ఆకట్టుకుంది. వరంగల్‌లోని సత్సంగ గురువు శివానంద నృత్యాలయానికి చెందిన గురువు భూమపల్లి సుధీర్‌రావు మార్గదర్శకత్వంలో రుత్విక నృత్యాన్ని అభ్యసించింది. ఆమె కృషి, పట్టుదలతో ఈ విజయాన్ని సాధించగలిగింది. పాఠశాల నిర్వహణ రుత్వికను అభినందిస్తూ "రుత్విక విజయంతో మా పాఠశాల ప్రతిష్ఠ మరింత పెరిగింది. కృషి, నిబద్ధత మరియు సరైన మార్గనిర్దేశం కలిస్తే అద్భుతాలు సాధ్యమవుతాయి" అని పేర్కొంది. "బాలోత్సవ్ 2025" మూడు రోజులపాటు అద్భుత సాంస్కృతిక ఉత్సవంగా జరిగింది. ప్రధాన థీమ్ "ప్రారంభ తెలుగు బాల సంఘం" కింద గానం, నృత్యం, నాటకం, క్విజ్, సైన్స్ ఎగ్జిబిషన్ వంటి 20కి పైగా పోటీలు జరిగాయి. ఈ ఉత్సవం తెలుగు భాషను, కళలను మరియు సృజనాత్మకతను ప్రోత్సహించడమే లక్ష్యంగా నిర్వహించబడింది.

# మెట్టు రామలింగేశ్వరుడికి ఉచిత సామూహిక మహన్యాస రుద్రాభిషేకం



కాజీపేట నవంబర్ 09 మేజర్ న్యూస్ (సూర్య) హన్మకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండలో స్వయంభుగా వెలసి దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో నెల రోజులపాటు జరిగే కార్తీక మాస ఉత్సవాలలో భాగంగా స్వామి వారి జన్మ నక్షత్రం ఆరుద్ర సందర్భంగా మెట్టు రామలింగేశ్వర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతినెల రెండవ ఆదివారం భక్తులకు ఉచిత సామూహిక మహన్యాస రుద్రాభిషేకం వివిధ రకాల పుష్పాలతో పుష్పార్చన బీరువా శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని అభిషేకించిన అనంతరం అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ప్రాతక్కాల సమయంలో శివ కేశవులకు వైభవంగా ఆకాశదీపోత్సవం నిర్వహించి శివాలయంలో శ్రీ స్వామివారికి ప్రదోషకాల రుద్రాభిషేకం రుద్రాక్షలతో లక్ష రుద్రాక్ష పూజ నీరాజనం మంత్రపుష్పం నక్షత్ర హారతి రాజోపచార పూజలు పవళింపు సేవ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు రాగిచెడు అవినాష్ శర్మ మాట్లాడుతూ కార్తీక మాసంలో మూడవ సోమవారం సందర్భంగా నవంబర్ 10వ తేదీ ఉదయం స్వామివారికి ప్రాంతకాల రుద్రాభిషేకం మహా హారతి ప్రదోషకాలంలో కల్వపూవులతో పుష్పార్చన నిర్వహించబడును రామాలయంలో శ్రీరామచంద్ర స్వామి వారి జన్మ నక్షత్రం పునర్వశ సందర్భంగా శ్రీ సీతారామచంద్రస్వామి వారి కి పాల పంచామృతాలతో సర్వంకాభిషేకం నిర్వహించబడును అనంతరం మూల మంత్రం హెూమం నిర్వహించి ప్రదోషాకాలంలో ఆకాశదీపోత్సవం రుద్రాభిషేకం నీరాజనం మంత్రం పుష్పం నక్షత్ర హారతి చతుర్వేద స్వస్తి రాజోపచార పూజలు పవళింపు సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించబడును కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమాలు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆర్ సునీత ఎస్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించగా ఈ కార్యక్రమాలు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆర్ సునీత ఎస్ సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు రాగిచెడు అఖిలాష్ శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, శ్రీ పారుపల్లి సత్యనారాయణ శర్మ, నిర్వహించారు.





# పింకు డైరీలో రాసి పెట్టుకుంటాం

- అధికారంలోకి రాగానే ఎవరిని వదిలిపెట్టం
- మాజీ ఎమ్మెల్యే భానోత్ హరిప్రియ నాయక్



బయ్యారం, మేజర్ న్యూస్ సూర్య, నవంబర్ 9 : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ బిఆర్ఎస్ నాయకులపై కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం వారిని ఇబ్బందులకు గురి చేయడం, ఎవరెవరు ఏమి చేస్తున్నారో పింకు డైరీలో రాసి పెట్టుకుంటున్నామని ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అందరి లెక్కలు తేలుస్తామని మాజీ ఎమ్మెల్యే ఇల్లందు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి నాయకులు బానోత్ హరిప్రియ నాయక్ అన్నారు. మండలంలోని గౌరారం గ్రామపంచాయతీ పరిధిలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాతా గణేష్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే పాల్గొని గ్రామంలోని ఇతర పార్టీల నుండి సుమారుగా 65 కుటుంబాలు బిఆర్ఎస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా రేవంత్ రెడ్డి పాలన కొనసాగుతుందని ఆరోపించారు. మండలంలో సొంత పార్టీ నాయకులపైనే దాడులు జరిగితే ఎమ్మెల్యే స్పందించలేనీ పరిస్థితుల్లో ఉన్నారని కాంగ్రెస్ పార్టీ అంటేనే రౌడీల పార్టీ అని ఆరోపించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందని, కాంగ్రెస్ పాలనలో గ్రామ పరిపాలన కూడా కుంటుపడిందని, మౌళిక వసతులు, వీధిలైట్లు కూడా పెట్టలేని దుస్థితిలో ప్రభుత్వ పాలన ఉన్నదని అన్నారు. మండలంలో ప్రశ్నిస్తే దాడులు చేయడం పరిపాటిగా మారిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా మాజీ జడ్పీ చైర్పర్సన్ అంగోత్ బిందు గంగుల సత్య నారాయణ, మురళీకృష్ణ, లక్ష్మణ్ నాయక్, రేపాకుల వెంకన్న, జరుపుల శ్రీను, జగన్, పాల్గొన్నారు.



## ఈనెల 14న బహిరంగ వేలం




పాలకుర్తి నవంబర్ 09 మేజర్ న్యూస్ (సూర్య) : శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహా స్వామి ఆలయంలో ఈనెల 14న శుక్రవారం ఉదయం 11గంటలకు కొబ్బరి కాయలు, పూజా సామగ్రి అమ్ముకునే హక్క కోసం (అభిషేకం, వాహన పూజ సామగ్రి మినహాయించి), తల నీలాలు పోగు చేసుకునే హక్కు లైసెన్స్ కోసం సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తు న్నట్లు ఆలయ ఈఓ భాగం లక్ష్మీ ప్రసన్న ఆదివారం ఒక ప్రకటనలతో తెలిపారు. పాల్గొనేవారు ఈనెల 13 న సాయం త్రం 5 గంటల లోపు బుకింగ్ కార్యాలయంలో రూ.1000 చెల్లించి టెండర్ షెడ్యూల్ పొందాలని కోరారు.

## కాంగ్రెస్ కు జూబ్లీహిల్స్ ఎన్నికలపై ఉన్న శ్రద్ధ పంట నష్టం జరిగిన రైతులపై లేదా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి నవీన్



పాలకుర్తి నవంబర్ 09మేజర్ న్యూస్ (సూర్య): కాంగ్రెస్ ప్రభుత్వానికి, నాయకులకు జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంపై ఉన్న శ్రద్ధ మొంథా తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులపై లేదా అని బీఆర్ఎస్ పాలకుర్తి మండల పార్టీ అధ్యక్షులు పసునూరి నవీన్ మండిపడ్డారు. 6 గ్యారంటీల హామీలతో ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి పంట నష్టం జరిగిన రైతులను పరామర్శించడానికి సమయం లేదా అని అన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ లో మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ ఒక్క రైతు కూడా సంతోషంగా లేదని రైతుల బాగోగులు చూసుకోలేని ఏ ప్రభుత్వం బాగుండదని రైతులకు అన్యాయం చేయొద్దని వెంటనే పంట నష్టం జరిగిన రైతులను పరామర్శించి నష్ట పరి హారం అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులు కృషి చేయాలని అన్నారు.

## నిట్ వరంగల్ విద్యార్థులందరికీ ఉచిత గేట్ కోచింగ్ తరగతులు ప్రారంభం




కాజీపేట నవంబర్ 09 మేజర్ న్యూస్ (సూర్య) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) వరంగల్‌లోని యస్‌సి, యస్‌టి, సెల్ ఇప్పుడు కేటగిరీతో సంబంధం లేకుండా విద్యార్థులందరికీ ఉచిత గేట్ కోచింగ్ తరగతులు ప్రారంభించబడిందని ప్రకట ించడం ఆనందంగా ఉంది. ఈ చొరవ నిట్ వరంగల్ నుండి మరియు వరంగల్ మరియు చుట్టుపక్కల ఉన్న ఇతర ఇంజనీరింగ్ కళాశాలల నుండి జనరల్, యస్‌సి, యస్‌టి, బిసి, మొదలైన విద్యార్థులతో సహా ఔత్సాహిక ఇంజనీర్ల విస్తృత సమూహానికి ప్రయోజనం చేకూర్చడం లక్ష్యంగా పెట్టుకుంది. కోచింగ్ ప్రోగ్రామ్ అన్ని ఇంజనీరింగ్ బ్రాంచ్‌లను కవర్ చేస్తుంది మరియు 17 నవంబర్ 2025 నుండి 9 జనవరి 2026 వరకు 8 వారాల పాటు కొనసాగుతుంది. ఇంజినీరింగ్ (గేట్)లో గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు సిద్ధమవుతున్న ప్రతి విద్యార్థికి సమాన అభ్యాస అవకాశాలు మరియు నాణ్యమైన మార్గదర్శకత్వం కోసం నిట్ వరంగల్ నిబద్ధతను విస్తరించిన యాక్సెస్ ప్రతిబింబిస్తుంది. ఆసక్తి గల అభ్యర్థులు అందించిన మార్గదర్శకాల ప్రకారం నమోదు చేసుకోవచ్చు మరియు తరగతులకు హాజరు కావచ్చు. దరఖాస్తు ఫారమ్, నియమాలు మరియు నిబంధనలు మరియు ఇతర వివరాలు నిట్ వరంగల్ వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్‌ల విభాగం క్రింద nitw.ac.in లో అందుబాటులో ఉన్నాయి అని అన్నారు.

# చుక్క సత్తయ్య విగ్రహ ఏర్పాటు మహోత్సవం



జనగామ టౌన్ నవంబర్9మేజర్ న్యూస్ సూర్య : తెలంగాణ ప్రభుత్వ సహకారంతో జనగామ జిల్లా కేంద్రంలోని కళ్లెం రోడ్డు కమాన్ పక్కన ఒగ్గుకళా ప్రవీణులు, ఒగ్గుకళా సామ్రాట్, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ చుక్క సత్తయ్య 8వ వర్ధంతిని పురస్కరించుకొని విగ్రహ ఏర్పాటు మహోత్సవ కార్యక్రమాన్ని సబ్బండ వర్గాల కళాకారుల జేజేల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. చుక్క సత్తయ్య ఒగ్గుకలకు చేసిన సేవలు అనన్యసామాన్యమైనవి. 8 వేల యువకళాకారులను తీర్చిదిద్దిన ఆది గురువు డాక్టర్ చుక్క సత్తయ్య వారు నేటి కళాకారులకు చిరస్మరణీయులు మరియు ప్రాతస్మరణీయులు. 29 మార్చ్ 2026 రోజున చుక్కా సత్తయ్య జయంతి కార్యక్రమం సందర్భంగా ప్రభుత్వ పెద్దల చేతుల మీదుగా ఈ విగ్రహం ఆవిష్కరణ ఉంటుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షులు శ్రీ సేవెల్లి సంపత్ కురుమ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ జాయ మల్లేష్ కురుమ పట్టణ అధ్యక్షకార్యదర్శులు శ్రీ బాల్దే మల్లేశం, జూకంటి శ్రీశైలం, కోపా అధ్యక్షులు కడకంచి మధు, కోశాధికారి ఏంద్రు వైకుంఠం, కేమిడి ఉపేందర్, లింగాల ఘనపూర్ కురుమ సంఘం మండల అధ్యక్షులు బండ చంద్రమౌళి, జనగామ జిల్లా ఒగ్గు సంఘం అధ్యక్షులు శ్రీ బండి వీరస్వామి, ప్రధాన కార్యదర్శి జంగిడి సిద్దులు, మహిళా బోనాల కోలాటం జనగామ జిల్లా స్టీరింగ్ కమిటీ ఆడబిడ్డలు, గౌరవ సలహాదారులు చౌదరిపల్లి రోషయ్య, బంద్రు సత్తయ్య, కవి కడకంచి పాపయ్య కోశాధికారి బండి ప్రవీణ్, నెల్లుట్ల పెద్ద కురుమ కడకంచి ఆంజనేయులు, ప్రచార కార్యదర్శి బర్ల అనిల్ కుమార్, లింగాల ఘనపూర్ మండల అధ్యక్షులు చిన్నం శ్రీనివాస్, మండల గౌరవ సలహాదారులు చౌదరిపల్లి ఎల్లయ్య, చౌదరిపల్లి అంజయ్య, కార్యవర్గ సభ్యులు, నోముల ప్రభాకర్, బుగ్గ శ్రీనివాస్, బడికే శ్రీనివాస్, చౌదరిపల్లి మల్లయ్య, చౌదరిపల్లి ఉపేందర్, చౌదరిపల్లి ప్రవీణ్, చౌదరపల్లి ప్రశాంత్, బండ మల్లేష్, బర్ల భరత్, జనగామ మండల సలహదారులు జాయ సత్తయ్య, బండారి చంద్రయ్య మరియు అభిమానులు పాల్గొన్నారు.జనగామ జిల్లా కురుమ మరియు ఒగ్గుబీర్ల కళాకారుల సంక్షేమ సంఘం



# వార్డుమెంబర్ రవి కుమారుడి పెళ్లికి హాజరైన కాంగ్రెస్ శ్రేణులు



ఆత్మకూరు నవంబర్ 09, మేజర్ న్యూస్ (సూర్య) : పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ఆత్మకూరు మండలం గూడెప్పాడ్ లోని ఎం ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో జరిగిన ఆత్మకూరు వార్డు నెంబర్ కాడబోయిన రవి కుమారుని రిసెప్షన్ కు కాంగ్రెస్ మండల అధ్యక్షులు కమలాపురం రమేష్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, ఆత్మకూరు పిఎసిఎస్ మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్ ఆత్మకూరు కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి అల్వాల రవి కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా చంద్రశేఖర్ గుప్తా



భీమదేవరపల్లి, నవంబర్ 09(మేజర్ న్యూస్ సూర్య): భీమదేవరపల్లి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఆర్యవైశ్య సంఘ సమావేశంలో నూతన కమిటీ ఎంపిక జరిగింది. ఈ సమావేశంలో కొత్తపల్లి గ్రామానికి చెందిన కొమురవెల్లి చంద్రశేఖర్ గుప్తాను మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. గౌరవ అధ్యక్షుడిగా అంచూరి సదానందం, ప్రధాన కార్యదర్శులుగా వెంకట్రాజం, ఉపాధ్యక్షులుగా గన్ను శ్రీనివాస్, భూపతి విజయ్, కోశాధికారి గా ఉపేందర్, రఘు రాములు, సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా రమేష్ నియమితులయ్యారు. కొత్త అధ్యక్షుడు చంద్రశేఖర్ గుప్తా మాట్లాడుతూ.. సంఘాన్ని మరింత బలోపేతం చేసి సమాజ అభివృద్ధి కోసం కృషి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం నూతన అధ్యక్షుడిని సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, స్థానిక నాయకులు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# కోతుల బెడద తీర్చేందుకు బోను తయారీ

## – మంకీ బోన్‌తో కోతుల పట్టివేత

## – దాత రాజుకు రైతుల అభినందన వెల్లువ



దంతాలపల్లి,నవంబర్ 9 మేజర్ న్యూస్ (సూర్య): కోతుల బెడదతో జనాలు దొబ్బేలెత్తిపోతున్నారు. కోతుల బెడదతో కంటిమీద కొనుకు కరువై పంటలను రక్షించుకుంది ఎందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతుండగా, పంట పొలాల్లో కోతుల నుండి రక్షించాలని రైతులు వేడుకుంటున్న వేళ. బ్రాహ్మణ కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతు రాజు తన సొంత ఖర్చులతో సుమారు రు.40 వేలతో మంకీ బోనును తయారు చేయించి బొడ్లాడ, కొత్తపల్లి గ్రామస్తులకు ఇచ్చాడు. రెండు గ్రామాల రైతులు ఈ మంకీ బోన్ ను ఏర్పాటు చేసి దాంట్లో పల్లికాయ వేసి కోతులు ఊళ్లోకి వచ్చిన కోతులను పట్టుకొని వాటిని దూర ప్రాంతమైన అటవీ ప్రాంతాల్లోకి తీసుకొని పోయి వదిలిపెట్టి వస్తున్నారు. వేరుశనగ,కూరగాయల లాంటి పంటలను కాపాడుకోవడానికి కోతుల బెడుదల నుండి రక్షించుకోవడానికి రాజు మంకీ బోన్ను ఇప్పించినందుకు రైతులు అభినందనలు తెలుపుతున్నారు.

# ఆటో బైక్ ఢీ..








## – యువకుడు మృతి

మరిపెడ, నవంబర్ 09,మేజర్ న్యూస్(సూర్య):అతివేగంగా బైకు ఆటోను ఢీ కొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని బురహాను పురం గ్రామ శివారులో జాతీయ రహదారి 365 పై ఆదివారం సాయంత్రం జరిగింది. ఎస్సై వీరభద్రరావు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా అరవపల్లి మండలం ఇటిక్యాల పల్లి గ్రామానికి చెందిన శివరాత్రి చందు (25), ఖమ్మం జిల్లా సిరిపురం గ్రామానికి చెందిన రాము బురహాను పురం గ్రామానికి ధ్వజస్తంభం ప్రతిష్టాపన కార్యక్రమానికి చుట్టాల ఇంటికి వచ్చారు. ఈ క్రమంలోనే ఇద్దరూ ద్విచక్ర వాహనంపై సాయంత్రం మండల కేంద్రమైన మరిపెడకు బయలుదేరారు. ఈ నేపథ్యంలోనే బైకు ఓవర్ స్పీడ్ తో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొట్టినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో శివరాత్రి చందు అక్కడికక్కడే మృతి చెందగా, రాము చేయి విరిగి తీవ్రగాయాలతో రోడ్డుపై పడి ఉన్నాడు. క్షతగాత్రుడిని 108 లో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు మరిపెడ ఎస్సై వీరభద్రం తెలిపారు. కాగా ద్విచక్ర వాహనంపై వస్తున్న యువకులు మద్యం సేవించి రాష్ డ్రైవింగ్ చేసినట్లు తెలుస్తోంది.